


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 9 సంచిక : 365 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : కాకినాడ | శనివారం 5 సెప్టెంబర్ 2026 | వెల : 1/-రూ ॥

VOLUME 9 ISSUE :365 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : KAKINADA | SAT 5 SEPTEMBER 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



## రాజమండ్రిలో సగం కాలుష్యానికి
# కారణం ఇదే

- పుష్కర కాలంగా పన్నులు ఎగవేస్తున్న ఆంధ్ర పేపర్ మిల్లు
- రాజమండ్రి కాలుష్యంలో సగం ఆ పరిశ్రమ వల్లేనన్న పవన్
- పద్ధతి మార్చుకోకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- కోర్టు కేసులను వేగవంతం చేయాలని న్యాయవాదులకు ఆదేశాలు
- స్వచ్ఛ గోదావరి లక్ష్యంగా ముందుకెళతామన్న ప్రభుత్వం

**పెన్ పవర్ డెస్క్:**రాజమండ్రిలోని ఆంధ్ర పేపర్ లిమిటెడ్ (ఏపీఎల్) తీరుపై రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పుష్కర కాలంగా పన్నులు ఎగవేస్తూ, మరోవైపు గోదావరి నదిని తీవ్రంగా కలుషితం చేస్తూ బాధ్యతారహితంగా వ్యవహరిస్తోందని ఆయన విరుచుకుపడ్డారు. రాజమండ్రిలో సగం కాలుష్యానికి ఈ కంపెనీయే కారణమని ఆరోపించారు. పద్ధతి మార్చుకోకపోతే పరిశ్రమ కార్యకలాపాలను నిలిపివేయడం దగ్గర నుంచి లైసెన్సు రద్దు వరకు ఎలాంటి కఠిన చర్యలకైనా వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఈ మేరకు కంపెనీకి షోకాజ్ నోటీసులు జారీ చేసి, తక్షణమే చర్యలు చేపట్టాలని కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులను ఆదేశించారు.

**పుష్కర కాలంగా పన్ను ఎగవేత**

2016 నుంచి కాతేరు గ్రామ పంచాయతీకి గానీ, రాజమండ్రి నగరపాలక సంస్థకు గానీ ఆంధ్ర పేపర్ మిల్లు ఒక్క రూపాయి కూడా పన్ను చెల్లించలేదని పవన్ కల్యాణ్ ఆరోపించారు. స్థానిక సంస్థలకు సుమారు రూ. 21.34 కోట్ల మేర పన్నులు బకాయిపడిందని ఆయన తెలిపారు. పన్ను చెల్లించాలని అధికారులు నోటీసులు జారీ చేసిన ప్రతిసారీ, యాజమాన్యం కోర్టులను ఆశ్రయించి జాప్యం చేస్తోందని, బాధ్యత నుంచి తప్పించుకుంటోందని

- మిగతా 2లో

# అక్షరాస్యతపై కూటమి ప్రభుత్వం తప్పుడు ప్రచారం

- ఏపీ అక్షరాస్యతపై మంత్రి లోకేశ్ ప్రకటనను తప్పుబట్టిన జగన్
- ఇది పూర్తిగా తప్పుడు సమాచారంతో కూడిన ప్రచారమని విమర్శ
- కేంద్ర ప్రభుత్వ గణాంకాలను ఉటంకిస్తూ వివరణ ఇచ్చిన మాజీ సీఎం
- ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులు తగ్గుతున్నారని ఆందోళన వ్యక్తీకరణ
- విద్యాశాఖపై దృష్టి పెట్టాలని లోకేశ్‌కు సూచించిన జగన్

**పెన్ పవర్ డెస్క్:**ఏపీలో అక్షరాస్యత రేటు 2024లో 72.6శాతం నుంచి 2026 నాటికి 82.1శాతానికి పెరిగిందంటూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేసిన ప్రకటనపై మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు జగన్ తీవ్రంగా స్పందించారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని చూసి తాను దిగ్భ్రాంతికి గురయ్యానని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

2026 క్యాలెండర్ సంవత్సరం ఇంకా పూర్తి కానందున, అక్షరాస్యతకు సంబంధించి ఏ అధికారిక సంస్థ కూడా గణాంకాలను విడుదల చేయలేదని జగన్ స్పష్టం చేశారు. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖకు చెందిన ఎన్ఎస్ఎస్ఓ విడుదల చేసిన 'పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే' (పీఎల్ఎఫ్ఎస్) 2023–24 వార్షిక నివేదికను ఆయన ఉటంకించారు. దాని ప్రకారం.. 2023 జూన్ నుంచి 2024 జూన్ మధ్య కాలంలో ఏపీలో ఏడేళ్లకు పైబడిన వారిలో అక్షరాస్యత 72.6శాతంగా ఉందని, ఇదే 2018–19లో 69.1శాతంగా ఉండేదని గుర్తుచేశారు.



అంతేకాకుండా, 2026 జులై 2న ప్రచురించిన పీఎల్ఎఫ్ఎస్ 2025 నివేదిక ప్రకారం.. 2025 జనవరి నుంచి 2025 డిసెంబర్ మధ్య కాలంలో రాష్ట్ర అక్షరాస్యత 71.4శాతంగా నమోదైందని తెలిపారు. వాస్తవాలు ఇంత స్పష్టంగా ఉన్నప్పుడు, ప్రభుత్వం తప్పుడు వాదనలతో ప్రజలను మభ్యపెట్టాలని చూడటం అత్యంత దురదృష్టకరమని జగన్ వ్యాఖ్యానించారు.

ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ విధానాల కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తగ్గి, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశాలు పెరుగుతున్నాయని కేంద్ర విద్యాశాఖకు చెందిన యూడీఐఎస్ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయని, ఇది ఆందోళన కలిగించే విషయమని జగన్ అన్నారు.

ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు విద్యను మరింత అందుబాటులోకి ఎలా తీసుకురావాలనే దానిపై దృష్టి పెట్టాల్సింది పోయి, టీడీపీ కూటమి ప్రభుత్వం మోసపూరిత వ్యూహాలతో తప్పుడు ప్రచారాలు చేసుకోవడంలో నిమగ్నమైందని విమర్శించారు. విద్యాశాఖ మంత్రి తన శాఖపై ఎక్కువ సమయం కేటాయించాలి కానీ 'రెడ్ బుక్ గవర్నెన్స్' మీద కాదని లోకేశ్‌కు హితవు పలికారు.



## కేరళలో నారా లోకేశ్.. అమృతపురిలో 'అమ్మ' ఆశీర్వాదం...

- కేరళలో పర్యటించిన మంత్రి నారా లోకేశ్
- కొల్లం జిల్లాలోని అమృతపురి ఆశ్రమం సందర్శన
- మాతా అమృతానందమయి ఆశీస్సులు అందుకున్న లోకేశ్
- ఆశ్రమంలోని అమృత విశ్వ విద్యాపీఠాన్ని పరిశీలించిన వైనం
- ఈ పర్యటన వ్యక్తిగతమని, అధికారికం కాదని సమాచారం

- మిగతా 2లో




## ఏపీలో ఉత్తమ ఉపాధ్యాయుల జాబితా విడుదల

**పెన్ పవర్ డెస్క్:** 2026 సంవత్సరానికి గాను ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. పాఠశాల విద్యాశాఖ నుంచి 79 మంది, ఇంటర్ బోర్డు నుంచి 24 మందిని ఎంపిక చేసింది. ఉపాధ్యాయులు, హెచ్ఎంలు, లెక్చరర్లు, ప్రిన్సిపాళ్ల పేరుతో జీవో జారీ చేసింది. రాష్ట్రస్థాయి కమిటీ సిఫార్సుల మేరకు ఈ అవార్డులను ఖరారు చేశారు. శనివారం గురుపూజోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను ప్రభుత్వం సత్కరించనుంది.

## నెల్లూరు సర్వేపల్లి కాలువ కట్టవాసుల
# 60 ఏళ్ల నిరీక్షణకు తెర



- నెల్లూరు సర్వేపల్లి కాలువ కట్టవాసులకు ఇళ్ల పట్టాల మంజూరు
- 60 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యకు పరిష్కారం
- 1,215 పేద కుటుంబాలకు లబ్ధి చేకూర్చేలా కేబినెట్ నిర్ణయం
- మంత్రి నారాయణ చొరవతో సీఎం చంద్రబాబు ఆమోదం
- త్వరలో సీఎం చేతుల మీదుగా పట్టాల పంపిణీకి ఏర్పాట్లు

- మిగతా 2లో



## ట్రంప్ దృష్టిలో మోదీ అగ్రస్థానంలో ఉంటారు..

**అమెరికా రాయబారి ఆసక్తికర వ్యాఖ్యలు!**

- మోదీని కలవడానికి ట్రంప్ ఆసక్తిగా ఉన్నారన్న సెర్గియో గోర్
- డిసెంబర్‌లో జీ20 సదస్సు కోసం అమెరికా పర్యటనకు మోదీ
- భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం త్వరలో ఖరారయ్యే సూచనలు
- 500 బిలియన్ డాలర్ల వాణిజ్య లక్ష్యం
- భారత్ విశ్వసనీయ రక్షణ భాగస్వామి అన్న గోర్

- మిగతా 2లో

## పుకెట్-ఢిల్లీ విమానంలో ప్రమాదం..
## డ్రగ్స్ తీసుకున్న పైలట్‌పై ఎయిరిండియా వేటు

- మాదకద్రవ్యాల పరీక్షలో పాజిటివ్‌గా తేలిన పైలట్‌ను తొలగించిన ఎయిర్ ఇండియా
- పుకెట్-ఢిల్లీ విమానంలో తీవ్ర ఘటన అనంతరం ఈ చర్యలు తీసుకున్న సంస్థ
- ఈ ఘటనలో 20 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బందికి గాయాలయ్యాయి
- పైలట్‌పై చర్యలు తీసుకోవాలని ఏఏఐబీ ప్రాథమిక నివేదికలో సిఫారసు
- భద్రత విషయంలో తమది జీరో టాలరెన్స్ విధానమని స్పష్టం చేసిన ఎయిర్ ఇండియా

- మిగతా 2లో



## దమ్ముంటే హరీశ్ రావు భార్య
# నాపై పోటీ చేయాలి

- తనపై ఎవరు పోటీ చేసినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానన్న కవిత
- తాను సీఎం కావాలని కోరుకుంటున్నానని వెల్లడి
- బీజేపీతో హరీశ్ రహస్య ఒప్పందాలు చేసుకుంటున్నారని ఆరోపణ

- మిగతా 2లో



## శ్రద్ధాంజలి



కీ॥శే॥ కప్పల మురళీ వెంకట బాల రామారావు (బాలు) గారు
Visakhapatnam Port Authority
(1970 - 2026)
(S/o. కప్పల జగ్గారావు (లేటు))

ప్రేమ, అనురాగం, ఆప్యాయతలను పంచి కుటుంబ శ్రేయస్సుకు, మా ఉన్నతికి
ఎంతగానో శ్రమించిన మీరు భౌతికంగా మా మధ్యన లేకపోయినా...
మీ మధుర జ్ఞాపకాలు ఎల్లప్పుడూ మా మదిలో పదిలం.
మీ ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుని మనసారా కోరుకుంటూ...

కుటుంబ సభ్యులు

తల్లి : కప్పల అమ్మాజీ
భార్య : నిర్మల వెంకట లక్ష్మి
కుమార్తె : కప్పల కీర్తన షణ్ముఖి
కుమారుడు : కప్పల గణేష్ శ్రీ దత్త
మావయ్య : కొలిపాక కూర్మారావు
అత్తయ్య : కొలిపాక ఛాయాదేవి

కొలిపాక గంగాధర్ (లేటు)
కొలిపాక సూర్య కుమారి
కొలిపాక సాయి శ్రీ వంశీ
కొలిపాక అరవింద్
కొలిపాక మధు
కొలిపాక ఆశ్రిత

పెద్ద కర్మ : తేది 05-09-2026 స్థిరవారం మధ్యాహ్నం 12 గంటల నుండి కళింగ ఫంక్షన్ హాల్, సీతమ్మధార, విశాఖపట్నం-2 నందు జరుపబడును.

# నెల్లూరు సర్వేపల్లి కాలువ కట్టవాసుల 60 ఏళ్ల నిరీక్షణకు తెర

నెల్లూరు నగరంలో ఆరు దశాబ్దాలుగా నలుగుతున్న తీవ్రమైన సమస్యకు ఏపీప్రభుత్వం పరిష్కారం చూపింది. సర్వేపల్లి కాలువ కట్టపై నివసిస్తున్న సుమారు 1,215 నిరుపేద కుటుంబాలకు శాశ్వత నివాస హక్కు కల్పిస్తూ ఇళ్ల పట్టాలు మంజూరు చేసేందుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదముద్ర వేసింది. దశాబ్దాల తరబడి అభద్రతాభావంతో జీవిస్తున్న పేదల సొంతింటి కలను నెరవేరుస్తూ ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది.

**ఏళ్ల తరబడి ఎదురుచూపులు..**

గత 60 ఏళ్లుగా సర్వేపల్లి కాలువ కట్టపై వేలాది మంది నిరుపేదలు నివాసముంటున్నారు. అయితే, ఆ స్థలాలకు వారికి చట్టబద్ధమైన హక్కులు లేవు. కాలువ పోరంబోకు భూమి కావడంతో, ఎప్పుడు తమ నివాసాలు ఖాళీ చేయిస్తారోనన్న భయంతోనే వారు జీవనం సాగిస్తున్నారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు పట్టాలు ఇస్తామని హామీలు ఇచ్చినా, అవి కార్యరూపం దాల్చలేదు. దీంతో అక్కడి ప్రజల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

**మంత్రి నారాయణ చొరవతో పరిష్కారం..**

ప్రస్తుత ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారాయణ, ఈ దీర్ఘకాలిక సమస్యపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. కాలువ కట్ట వాసుల ఇబ్బందులను, వారి ఆవేదనను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి కృషి చేశారు. ఇటీవల భగత్ సింగ్ కాలనీ వాసుల సమస్యను పరిష్కరించిన స్ఫూర్తితో, ఈ అంశాన్ని కూడా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది.
కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై చర్చించి, మొత్తం 62.70 ఎకరాల భూమిలో 22.31 ఎకరాలను కెనాల్ పోరంబోకు నుంచి 'ఏడబ్ల్యూ డ్రై'గా వర్గీకరణ మార్చేందుకు ఆమోదం తెలిపారు. ఈ ప్రక్రియలో కాలువ నిర్వహణ హక్కులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ నిర్ణయంతో 1,215 కుటుంబాలకు అధికారికంగా ఇళ్ల పట్టాలు పొందేందుకు మార్గం సుగమమైంది.ప్రభుత్వ నిర్ణయం పట్ల మంత్రి నారాయణ హర్షం వ్యక్తం చేశారు. 60 ఏళ్ల కలను నిజం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే ముఖ్యమంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తామని ప్రకటించారు. కేబినెట్ నిర్ణయంతో సర్వేపల్లి కాలువ కట్ట వాసులు సంబరాలు చేసుకుంటున్నారు. తమ చిరకాల స్వప్నాన్ని నెరవేర్చిన సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణలకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

## ఎడిటర్ వ్యూ

### తర్వాత వంతు ద్వారంపూడిదేనటగా.. వరస కేసులు రెడీ అవుతున్నాయా?

కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు నిత్యం వివాదాస్పద వ్యాఖ్యలతో నాటి విపక్ష పార్టీలపై విరుచుకుపడిన ద్వారంపూడి చుట్టూ ఉచ్చు బిగుసుకుంటున్నట్లు కనిపిస్తుంది. ఇటీవల పలు కేసుల్లో వైసీపీ నేతలు వరసగా అరెస్ట్ లు అవుతున్నారు. తర్వాత వంతు ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిదేనన్న ప్రచారం ఊపందుకుంది. ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో స్థానికంగా ఉన్న జనసేన కార్యకర్తలపై కూడా దాడులు చేయించారన్న ఆరోపణలున్నాయి. అలాగే అనేక భూ వివాదాలు, రేషన్ బియ్యం తరలింపు వంటి ఆరోపణలను ద్వారంపూడి ఎదుర్కొన్నారు. వాటిన్నంటిపై ఒక్కొక్కటిగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విచారణలకు ఆదేశించింది.

**స్థానిక సంస్థల ఎన్నికలలోపేనా?**

స్థానిక సంస్థల ఎన్నికలలోపే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిపై చర్యలు తీసుకునే అవకాశాలున్నాయన్న ప్రచారం పెద్దయెత్తున జరగుతుంది. ద్వారంపూడిపై విచారణలు, కేసులను ప్రభుత్వం వేగవంతం చేసింది.ద్వారంపూడిపై కూటమి ప్రభుత్వ చర్యలు ప్రారంభించింది.కాకినాడ పోర్టు భూముల కుంభకోణం, బియ్యం స్మగ్లింగ్ వంటి వ్యవహారాలపై ఆయనపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి సిద్ధమయినట్లు తెలిసింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఆయనపై తదుపరి చర్యలు ఉంటాయనే చర్చ రాజకీయ వర్గాల్లో నడుస్తోంది. వరసగా విచారణలు ఒక్కొక్కటిగా పూర్తి కావస్తుండటం ద్వారంపూడిపై క్రిమినల్ చర్యలకు సిఫార్సులు చేస్తుండటంతో నెక్స్ట్ టార్గెట్ ఆయనేనన్న టాక్ మాత్రం రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తుంది.

**టీడీఆర్ బాండ్ల కుంభకోణం...**

కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి టీడీఆర్ బాండ్ల కుంభకోణం వివాదంలో చిక్కుకుని క్రిమినల్ విచారణను ఎదుర్కొంటున్నారు.టీడీఆర్ బాండ్ల వివాదం మరియు విజిలెన్స్ సిఫార్సులు చేసింది. కాకినాడలో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ ప్లాంటు కోసం 23 ఎకరాలు సేకరించాల్సి ఉండగా, కేవలం 4.66 ఎకరాలను మాత్రమే నకిలీ నోటిఫికేషన్‌తో అత్యవసరంగా సేకరించారన్న ఆరోపణలున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా, ఒక నిర్దిష్ట భూ యజమానికి లబ్ధి చేకూర్చేలా వ్యవహరించారని ఆరోపణలు వచ్చాయి.ఈ భూమి ముళ్లపొదలతో, వినియోగానికి పనికిరాని లోతట్టు ప్రాంతంలో ఉన్నప్పటికీ టీడీఆర్ బాండ్లు జారీ చేశారనే విమర్శలున్నాయి.ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. తనపై కూటమి ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని, అక్రమ కేసులు బనాయిస్తున్నారని ద్వారంపూడి వర్గీయులు ఆరోపిస్తున్నారు.

## ఢిల్లీని ముంచెత్తిన కుండపోత వర్షం.. జలదిగ్బంధంలో ఎయిర్‌పోర్ట్

దేశ రాజధాని ఢిల్లీని శుక్రవారం భారీ వర్షం ముంచెత్తింది. ఈ కుండపోత వర్షం కారణంగా ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం జలమయమైంది. దీంతో విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వందలాది విమానాలు ఆలస్యంగా నడుస్తుండగా, పలు విమానాలను ఇతర నగరాలకు దారి మళ్లించారు.
వివరాల్లోకి వెళితే, శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఢిల్లీలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ఎయిర్‌పోర్ట్ ప్రాంగణంలోని పలు ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. ఈ ప్రభావంతో మధ్యాహ్నం 3:30 నుంచి 4:30 గంటల మధ్యలో దాదాపు తొమ్మిది విమానాలను దారి మళ్లించారు. వీటిలో నాలుగు విమానాలను జైపూర్‌కు, మరో నాలుగు లక్నోకు, ఒకటి అహ్మదాబాద్‌కు మళ్లించినట్లు అధికారులు తెలిపారు. ఫ్లైట్‌రాడార్24 డేటా ప్రకారం, 400కు పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే ఈ విమానాశ్రయంలో రోజుకు 1,300కు పైగా విమానాలు రాకపోకలు సాగిస్తుంటాయి.ప్రతికూల వాతావరణం కారణంగా ఢిల్లీ విమాన సర్వీసులపై ప్రభావం పడిందని ఇండిగో, ఎయిర్ ఇండియా సంస్థలు వేర్వేరుగా ప్రకటించాయి. ప్రయాణికులు ఎయిర్‌పోర్ట్‌కు బయలుదేరే ముందు తమ ఫ్లైట్ స్టేటస్‌ను తప్పనిసరిగా చెక్ చేసుకోవాలని సూచించాయి. రోడ్లపై నెమ్మదిగా ప్రయాణం సాగుతున్నందున, ప్రయాణానికి అదనపు సమయం కేటాయించుకోవాలని ఇండిగో కోరింది.ఎయిర్‌పోర్ట్‌లో కార్యకలాపాలపై ప్రభావం పడిందని, తాజా సమాచారం కోసం ప్రయాణికులు సంబంధిత విమానయాన సంస్థలను సంప్రదించాలని ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ యాజమాన్యం విజ్ఞప్తి (జీఎంఆర్) చేసింది. నీటిని తొలగించడానికి తమ సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపింది. మరోవైపు, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఢిల్లీకి 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. సాయంత్రం వరకు ఉరుములు, మెరుపులతో కూడిన తీవ్ర వర్షపాతం నమోదవుతుందని హెచ్చరించింది. ఈ ఆకస్మిక పరిణామంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# దమ్ముంటే హరీశ్ రావు భార్య నాపై పోటీ చేయాలి

తెలంగాణలో రాజకీయ ప్రత్యర్థుల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు తీవ్ర స్థాయికి చేరాయి. నూతనంగా తెలంగాణ రక్షణ సేన పార్టీని స్థాపించిన కల్వకుంట్ల కవిత... బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు లక్ష్యంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. రాబోయే ఎన్నికల్లో ధైర్యముంటే హరీశ్‌రావు తన భార్యను తనపై పోటీకి దింపాలని బహిరంగ సవాల్ విసిరారు. తనపై ఎవరు పోటీ చేసినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించిన కవిత... హరీశ్‌రావు నేరుగా బరిలోకి రాకుండా తెరవెనుక రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. అవసరమని భావిస్తే రాజకీయాలను పక్కనపెట్టి ఆయన తన భార్యను బరిలోకి దించవచ్చని, ఆమె తనపై పోటీ చేసినా స్వాగతిస్తానని స్పష్టం చేశారు. గతంలో సిద్దిపేట నుంచి హరీశ్‌రావుపై పోటీ చేస్తానని చెప్పిన మాటను గుర్తు చేసిన కవిత...
వచ్చే ఎన్నికల్లో తాను సిద్దిపేట లేదా బోధన్ నియోజక వర్గాల నుంచి పోటీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటు న్నట్లు సంకేతాలిచ్చారు.ఇదే సమయంలో ముఖ్యమంత్రి పదవిపై తన ఆకాంక్షను కవిత బహిరంగంగా వెల్లడించారు. తాను సీఎం కావాలని అనుకుంటున్నానని, ఆ పదవికి హుందాతనం, గౌరవం చాలా ముఖ్యమని వ్యాఖ్యానించారు. హరీశ్‌రావు బీజేపీతో రహస్య ఒప్పందాలు చేసుకుంటున్నారని ఆరోపించారు.

## ట్రంప్ దృష్టిలో మోదీ అగ్రస్థానంలో ఉంటారు..

జీ20 సదస్సు కోసం భారత ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా వెళ్లనున్న నేపథ్యంలో ఇరు దేశాల మధ్య కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. మోదీని కలవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎంతగానో కోరుకుంటున్నారని అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు. డిసెంబర్‌లో ఫ్లోరిడాలో జరిగే జీ20 సదస్సు కేవలం బహుపాక్షిక సమావేశాలకే పరిమితం కాకపోవచ్చని ఆయన వ్యాఖ్యానించారు.
ట్రంప్ దృష్టిలో మోదీ స్నేహితుడని, 35 మంది నేతలు వస్తే ఎవరిని కలవాలనుకుంటారని అడిగితే.. మోదీ ఆయన జాబితాలో అగ్రస్థానంలో ఉంటారని గోర్ చెప్పారు. 2020లో భారత పర్యటనను ట్రంప్ ఇప్పటికీ ఎంతో ఇష్టంగా గుర్తుచేసుకుంటున్నారని, వచ్చే ఏడాది ఆయన భారత్‌కు వచ్చే అవకాశం కూడా ఉందని సంకేతాలు ఇచ్చారు. అమెరికా-భారత్ సంబంధాలు ఇతర దేశాలు అసూయపడే రీతిలో ఉన్నాయని వ్యాఖ్యానించారు.భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై కూడా గోర్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా సుప్రీంకోర్టు తీర్పు తర్వాత చర్చలను మళ్లీ కొనసాగిస్తున్నామని, ఒప్పందం "చాలా దగ్గర్లోనే ఉంది" అని తెలిపారు. రాబోయే కొన్ని నెలల్లో ఒప్పందం ఖరారవుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం సుమారు 240 బిలియన్ డాలర్లు ఉండగా.. దీన్ని 500 బిలియన్ డాలర్లకు పెంచాలని మోదీ, ట్రంప్ లక్ష్యంగా పెట్టుకున్నారు.

**భారత స్థిరత్వం కీలకం**

భారత్ ఆర్థికంగా బలపడటం అమెరికాకు కూడా ప్రయోజనకరమని గోర్ అన్నారు. మోదీ దేశానికి స్థిరత్వాన్ని అందిస్తున్నారని ప్రశంసించారు. అమెరికా కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెంచుతున్నాయని, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి సంస్థలు డేటా సెంటర్లు, ఏఐ కేంద్రాలు, ఔషధ రంగాల్లో విస్తరిస్తున్నాయని చెప్పారు. అమెరికాలోకి కొత్తగా 24 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించడంలోనూ రాయబార కార్యాలయం సహకరించిందన్నారు.

**రక్షణ బంధం మరింత బలోపేతం**

భారత్ తమకు విశ్వసనీయమైన రక్షణ భాగస్వామి అని గోర్ పేర్కొన్నారు. రక్షణ సంబంధాలు కేవలం ఆయుధాల కొనుగోళ్లకే పరిమితం కావని, పరస్పర విశ్వాసం కూడా కీలకమని చెప్పారు. జావెలిన్ క్షిపణి ప్రాజెక్టు, అపాచీ హెలికాప్టర్ల సరఫరా, మరిన్ని రక్షణ పరికరాలపై చర్చలను ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు. అమెరికాతో భారత్ ఇతర దేశాల కంటే ఎక్కువగా సైనిక విన్యాసాలు నిర్వహిస్తోందన్నారు.

**వరుస పర్యటనలతో బంధం బలోపేతం**

అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో అక్టోబర్‌లో మరోసారి భారత్‌కు రానున్నారు. తక్కువ వ్యవధిలో విదేశాంగ మంత్రి రెండుసార్లు భారత్‌కు రావడం అరుదని గోర్ అన్నారు. మరికొందరు అమెరికా కేబినెట్ మంత్రులు, మూడు రాష్ట్రాల గవర్నర్లు కూడా ఈ ఏడాది భారత్‌లో పర్యటించే అవకాశం ఉందన్నారు. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కూడా వచ్చే నాలుగు నెలల్లో మూడుసార్లు అమెరికా వెళ్లే అవకాశం ఉందని తెలిపారు.

**క్వాడ్‌పై అమెరికా ప్రత్యేక ఆసక్తి**

భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాతో కూడిన క్వాడ్ కూడా ఇరు దేశాల భాగస్వామ్యంలో కీలకమని గోర్ అన్నారు. మానవతా సాయం, విపత్తుల నిర్వహణ, సైనిక సహకారం, కృత్రిమ మేధ, డేటా సెంటర్లు, కీలక ఖనిజాల రంగాల్లో నాలుగు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. త్వరలో నాలుగు దేశాల నేతల శిఖరాగ్ర సమావేశం నిర్వహించేందుకు అమెరికా ఆసక్తిగా ఉందన్నారు.

# రాజమండ్రిలో సగం కాలుష్యానికి కారణం ఇదే

మండిపడ్డారు. ప్రభుత్వంతో సంబంధం లేకుండా సొంతంగా పన్ను మినహాయింపు ఇచ్చుకున్నారా? అని ఆయన నిలదీశారు.

**గోదావరిని కమ్మేస్తున్న కాలుష్యం**

అధికారిక గణాంకాల ప్రకారమే రాజమండ్రి నగరంలోని మొత్తం కాలుష్యంలో సగం ఆంధ్ర పేపర్ మిల్లు నుంచే వస్తోందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. నగరం మొత్తం మీద రోజుకు 70 మిలియన్ లీటర్ల ద్రవ వ్యర్థాలు ఉత్పత్తి అయితే, ఒక్క ఆంధ్ర పేపర్ మిల్లు నుంచే 35 మిలియన్ లీటర్ల వ్యర్థాలు వెలువడుతున్నాయని వివరించారు. ఈ వ్యర్థ జలాల్లో ప్రమాదకర రసాయనాలు నిర్దేశిత పరిమితికి మించి ఉన్నాయని పరీక్షల్లో తేలిందన్నారు. లాగూన్ల వద్ద సేకరించిన నీటి నమూనాల్లో బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (బీఓడీ) లీటరుకు 36 మిల్లీగ్రాములుగా ఉందని, ఇది ప్రమాణాల కన్నా 20 శాతం అధికమని తెలిపారు. అదేవిధంగా ఫాస్ఫేట్ 6 శాతం, సల్ఫైడ్‌లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రమాణాల కన్నా ఏకంగా 70 శాతం అధికంగా ఉన్నాయని ఆయన వెల్లడించారు.

**పర్యావరణం, ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం**

పరిశ్రమ విడుదల చేస్తున్న కాలుష్యం వల్ల గోదావరి నీటిలో ఆక్సిజన్ స్థాయిలు తగ్గి జలచరాల మనుగడకు ముప్పు వాటిల్లుతోందని, నది సహజ పర్యావరణ వ్యవస్థ దెబ్బతింటోందని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. దుర్వాసన, నీటి నాణ్యత క్షీణతతో ప్రజారోగ్యానికి హాని కలుగుతోందని, భవిష్యత్ తరాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని అన్నారు. గతంలో తాను క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు భూగర్భ జలాలు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించినా, యాజమాన్యం పట్టించుకోలేదని గుర్తుచేశారు.

**ఇక ఉపేక్షించేది లేదు..**

నిబంధనలు ఉల్లంఘిస్తున్నందున పరిశ్రమ కార్యకలాపాలను నిలిపివేయడం, జరిమానాలు విధించడం, కంపెనీని సీజ్ చేయడం, లైసెన్సును రద్దు చేయడం వంటి కఠిన చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉందని పవన్ కల్యాణ్ హెచ్చరించారు. అయితే, పరిశ్రమలను ఇబ్బంది పెట్టకూడదనే ఉద్దేశంతోనే సంకీర్ణ ప్రభుత్వం ముందుగా షోకాజ్ నోటీసులు జారీ చేసి, తప్పు సరిదిద్దుకునే అవకాశం ఇచ్చిందని తెలిపారు. గత మూడు నెలలుగా పీసీబీ అధికారులు సంస్థ ప్రతినిధులతో పలుమార్లు చర్చించినా స్పందన కరువైందని అన్నారు.
ఈ నేపథ్యంలో తక్షణమే సమన్లు జారీ చేసి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇలాంటి కేసుల విచారణను వేగవంతం చేసేలా చూడాలని అడ్వకేట్ జనరల్, అదనపు ఏజీ, ఇతర ప్రభుత్వ న్యాయవాదులకు సూచించారు. 'స్వచ్ఛ గోదావరి - పవిత్ర పుష్కరాలు' నినాదంతో గోదావరి పరిరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు పర్యావరణవేత్తలు, పౌర సమాజం మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. ప్రజల ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణకే తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

## ఫుకెట్-ఢిల్లీ విమానంలో ప్రమాదం.. డ్రగ్స్ తీసుకున్న పైలట్‌పై ఎయిరిండియా వేటు

విమాన ప్రయాణికుల భద్రతను ప్రమాదంలోకి నెట్టిన ఓ పైలట్‌పై ఎయిర్ ఇండియా కఠిన చర్యలు తీసుకుంది. మాదకద్రవ్యాల (సైకోయాక్టివ్ సబ్‌స్టాన్స్) పరీక్షలో పాజిటివ్‌గా తేలడంతో పైలట్-ఇన్-కమాండ్ (పీఐసీ)ని తక్షణమే ఉద్యోగం నుంచి తొలగించినట్లు శుక్రవారం ప్రకటించింది. ఫుకెట్ నుంచి ఢిల్లీ వస్తున్న విమానంలో తీవ్రమైన ఘటన చోటుచేసుకున్న అనంతరం నిర్వహించిన పరీక్షల్లో ఈ విషయం బయటపడింది.
భద్రతా నిబంధనల ఉల్లంఘన విషయంలో తమది "జీరో-టాలరెన్స్" విధానమని ఎయిర్ ఇండియా ప్రతినిధి స్పష్టం చేశారు. "ఫుకెట్-ఢిల్లీ విమాన పైలట్ మాదకద్రవ్యాల పరీక్షలో పాజిటివ్‌గా తేలారు. భద్రత, ఫిట్‌నెస్ లేదా ఇతర నియంత్రణ నిబంధనల ఉల్లంఘనను ఏమాత్రం సహించబోము. ఈ కారణంగా ఆ పైలట్ సేవలను తక్షణమే రద్దు చేశాం" అని ఆయన తెలిపారు.ఈ ఘటనపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) ప్రాథమిక దర్యాప్తు నివేదికను విడుదల చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పైలట్ డ్రగ్స్ టెస్టులో పాజిటివ్‌గా తేలడం తీవ్రమైన ఆందోళన కలిగించే అంశమని, దీనిపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏఏఐబీ తన నివేదికలో సిఫారసు చేసింది.

**ఏం జరిగింది?**

వివరాల ప్రకారం, ఆగస్టు 4న 137 మంది ప్రయాణికులు, ఆరుగురు క్యాబిన్ సిబ్బంది, ఇద్దరు పైలట్లతో కలిపి మొత్తం 145 మందితో ఎయిర్ ఇండియాకు చెందిన ఎయిర్‌బస్ ఏ320 విమానం (ఏఐ-2379) ఫుకెట్ నుంచి ఢిల్లీకి బయలుదేరింది. విమానం ఒడిశా గగనతలంలో 36,000 అడుగుల ఎత్తులో ప్రయాణిస్తుండగా, దానిలోని మూడు హైడ్రాలిక్ వ్యవస్థలు ఒకేసారి విఫలమయ్యాయి. దీంతో విమానం అదుపుతప్పి ఒక్కసారిగా 372 అడుగులు పైకి వెళ్లి, ఆ తర్వాత 292 అడుగులు కిందికి వచ్చేసింది. ఈ ఘటనలో 20 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది గాయపడ్డారు.ఘటన అనంతరం ఢిల్లీలో ఇద్దరు పైలట్లకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బ్రీత్ ఎనలైజర్ పరీక్షలో ఇద్దరికీ నెగెటివ్ రాగా, మాదకద్రవ్యాల పరీక్షలో పీఐసీకి "నాన్-నెగెటివ్" ఫలితం వచ్చింది. అనంతరం నిర్ధారణ కోసం ఇద్దరి రక్త నమూనాలను ల్యాబొరేటరీకి పంపగా, పీఐసీ డ్రగ్స్ తీసుకున్నట్లు మరోసారి నిర్ధారణ అయింది. కో-పైలట్ ఫలితాలు మాత్రం నెగెటివ్‌గా వచ్చాయి. ఈ ఘటనపై సాంకేతిక, ఇతర అంశాలపై ఏఏఐబీ పూర్తిస్థాయి దర్యాప్తు కొనసాగిస్తోంది. విమానం బయలుదేరే ముందు నిర్వహించిన తనిఖీల్లో ఎలాంటి సమస్యలు లేవని నివేదిక పేర్కొంది.

## కేరళలో నారా లోకేశ్.. అమృతపురిలో 'అమ్మ' ఆశీర్వాదం...

ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శుక్రవారం కేరళలో పర్యటించారు. కొల్లం జిల్లాలోని ప్రఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రమైన మాతా అమృతానందమయి (అమ్మ) ఆశ్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మను దర్శించుకుని ఆమె ఆశీస్సులు అందుకున్నారు. ఇది పూర్తిగా లోకేశ్ వ్యక్తిగత పర్యటన అని, అధికారిక కార్యక్రమం కాదని తెలుస్తోంది.అమృతపురిగా ప్రసిద్ధి చెందిన ఈ ఆశ్రమంలో లోకేశ్ దాదాపు మూడు గంటల పాటు గడిపారు. ఆశ్రమ ప్రాంగణంలో ఉన్న కాళీమాత ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మను కలుసుకుని ఆశీర్వాదం పొందారు. ఆశ్రమంలోని గజరాజులకు పండ్లు అందించారు. ఈ పర్యటన తనకు ఎంతో ఆధ్యాత్మిక సంతృప్తినిచ్చిందని లోకేశ్ పేర్కొన్నారు. తన పర్యటనకు సంబంధించిన వివరాలను ఆయన తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు.ఈ ఆధ్యాత్మిక పర్యటనలో భాగంగా లోకేశ్ అక్కడి విద్యాసంస్థలను కూడా పరిశీలించారు. ఆశ్రమం ఆధ్వర్యంలో నడుస్తున్న అమృత విశ్వ విద్యాపీఠంతో పాటు, అమృత ఆయుర్వేద కళాశాలను ఆయన సందర్శించారు. అక్కడి విద్యాబోధన, మౌలిక సదుపాయాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఏపీ విద్యాశాఖ మంత్రిగా ఆయన విద్యాపీఠాన్ని సందర్శించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## ద్రవ్యోల్బణం, లిక్విడిటీ ఒత్తిడి.. రెపో రేటు పెంపునకు సిద్ధమవుతున్న ఆర్బీఐ?

- మొదటి పేజి తరువాయి

రూపాయి నిధుల వల్ల ఏర్పడిన అదనపు లిక్విడిటీ మరోవైపు.. ఈ రెండింటి మధ్య భారత ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ ఇన్వెస్టర్లు సంక్లిష్టమైన వాతావరణాన్ని ఎదుర్కొంటున్నారని నివేదిక విశ్లేషించింది. ఈ అదనపు నగదు ప్రవాహం కారణంగా ఓవర్‌నైట్ వడ్డీ రేట్లు, ఆర్బీఐ పాలసీ రేటు కంటే చాలా తక్కువ స్థాయికి పడిపోయాయని తెలిపింది. ఈ అసమతుల్యతను సరిదిద్దడానికి ఆర్బీఐ త్వరలోనే రంగంలోకి దిగాల్సి ఉంటుందని పేర్కొంది.ఈ పరిస్థితులను సాధారణ స్థితికి తీసుకురావడానికి ఆర్బీఐ ఎంత వేగంగా చర్యలు తీసుకుంటుందన్న దానిపైనే భవిష్యత్తు ఆధారపడి ఉందని నివేదిక అభిప్రాయపడింది. ఓవర్‌నైట్ రేట్లను తిరిగి పాలసీ రేట్లతో అనుసంధానించడం, మధ్యకాలికంగా ఉన్న అదనపు లిక్విడిటీని తగ్గించడం, ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుని రెపో రేటు పెంపుపై ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) నిర్ణయం తీసుకోవడం వంటి చర్యలు ఉంటాయని అంచనా వేసింది. ఎఫ్ఎక్స్ స్వాప్స్, ఎంఎస్ఎస్ బాండ్లు, ఓపెన్ మార్కెట్ ఆపరేషన్స్ (ఓఎంఓ) అమ్మకాలు, అవసరమైతే నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్ఆర్) పెంపు వంటి చర్యలను మార్కెట్ వర్గాలు ఆశిస్తున్నాయని తెలిపింది.మధ్యప్రాచ్యంలో మళ్లీ ఉద్రిక్తతలు పెరగడంతో ఇంధన ధరలు పెరగడం, వ్యవసాయ ఉత్పత్తులతో సహా ఇతర కమొడిటీల ధరల్లో ఒత్తిడి వంటి అంతర్జాతీయ అంశాలు ద్రవ్యోల్బణానికి ఆజ్యం పోస్తున్నాయని నివేదిక గుర్తు చేసింది. దీనికి తోడు, దేశంలో రుతుపవనాలు అస్తవ్యస్తంగా ఉండటం, జీడీపీ వృద్ధి బలంగా నమోదు కావడం, రుణ వృద్ధి సుమారు 18 శాతంగా ఉండటం వంటి స్థానిక పరిస్థితులు కూడా ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను పెంచుతున్నాయని వివరించింది.ఇప్పటివరకు వెలువడిన గణాంకాలు ఆర్బీఐకి కొంత ఊరటనిచ్చినప్పటికీ, ఇటీవలి ద్రవ్య పరపతి విధాన కమిటీ సమావేశపు మినిట్స్.. సభ్యుల వైఖరి కఠినంగా మారుతోందనడానికి సంకేతమని నివేదిక అభిప్రాయపడింది. ప్రపంచవ్యాప్తంగా ధరల ఒత్తిళ్లు మరింత తీవ్రమవుతున్న తరుణంలో, ప్రస్తుత పాలసీ వైఖరిపై ఎంపీసీ సభ్యులలో అసౌకర్యం పెరుగుతోందని అంచనా వేసింది.

# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా శ్రీనివాసరావు ఎంపిక.



**ఏలేశ్వరం, పెన్ పవర్ , సెప్టెంబర్ 4:** మండల పరిధి సి రాయవరం జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న తూమురోతు శ్రీనివాస్ రావు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైనట్లు విద్యాశాఖ శుక్రవారం ప్రకటించింది.

శ్రీనివాసరావుకి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా గౌరవం దక్కడం సంతోషించ దగ్గ విషయమని ఏలేశ్వరం మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అలమండ సత్యవతి అన్నారు. ఈ సందర్భంగా వార్డ్ కౌన్సిలర్ అలమండ చలమయ్య మాట్లాడుతూ ఏలేశ్వరం పట్టణంలో సాధారణ కుటుంబంలో జన్మించి కష్టపడి చదివి ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్న వరుసకు మేనల్లుడు అయిన తూమురౌతు శ్రీనివాసరావు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం తమ కుటుంబానికి దక్కిన గౌరవం అన్నారు. పట్టుదల కార్యదీక్షతో పనిచేసే వారికి తప్పక గుర్తింపు లభిస్తుందని శ్రీనివాసరావు మాస్టర్ ని స్ఫూర్తిగా తీసుకుని తోటి ఉపాధ్యాయులంతా అలాంటి గౌరవం దక్కించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాస్టర్ ని పలువురు అభినందించారు. టి .గురయ్య, అలమండ వెంకట దుర్గాప్రసాద్, కటకం కిరీటి, తదితరులు శ్రీనివాసులు అభినందించారు.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# రాజ్యసభ బిజినెస్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా ఎంపీ సానా సతీష్‌బాబు



**న్యూఢిల్లీ/కాకినాడ,పెన్ పవర్,సెప్టెంబర్ 4:** ఆంధ్రప్రదేశ్‌కు చెందిన టీడీపీ రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబును రాజ్యసభలోని ప్రతిష్టాత్మక బిజినెస్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా రాజ్యసభ చైర్మన్ నామినేట్ చేశారు. రాజ్యసభ కమిటీల పునర్వ్యవస్థీకరణలో భాగంగా పలు స్టాండింగ్ కమిటీలకు సభ్యులను నియమించిన సందర్భంగా సానా సతీష్‌బాబుకు ఈ అవకాశం లభించింది.

రాజ్యసభలో సభా కార్యక్రమాల నిర్వహణ, చర్చకు వచ్చే అంశాల ప్రాధాన్యత నిర్ణయించడం,సభా సమయాన్ని కేటాయించడం వంటి కీలక పార్లమెంటరీ వ్యవహారాల్లో బిజినెస్ అడ్వైజరీ కమిటీ ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది.ఇలాంటి కీలక కమిటీలో సానా సతీష్‌బాబు సభ్యుడిగా నియమితులు కావడం ఆంధ్రప్రదేశ్‌కు లభించిన ప్రాధాన్యమైన ప్రాతినిధ్యంగా టీడీపీ శ్రేణులు పేర్కొన్నాయి.ఈ బాధ్యత ద్వారా రాజ్యసభలో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన అంశాలు, ప్రజా సమస్యలు,అభివృద్ధి అంశాలను మరింత సమర్థవంతంగా ప్రస్తావించేందుకు అవకాశం ఉంటుందని ఆయన అనుచరులు,టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.సానా సతీష్‌బాబుకు సహచర ఎంపీలు, ప్రజాప్రతినిధులు,టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

# కత్తిపూడిలో అంగరంగ వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు....



- భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.....
- ఘనంగా ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొన్న యువత...

**శంఖవరం పెన్ పవర్ సెప్టెంబర్ 04:-** శంఖవరం కత్తిపూడి ఆర్కే నగర్ యాదవ్ వీధిలోని శ్రీకృష్ణ ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను స్థానికులు శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు.

శ్రీకృష్ణుడి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకరణలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా కత్తిపూడి పురవీధుల్లో శ్రీకృష్ణుడి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఊరేగించారు.ఊరేగింపు పొడవునా భక్తులు మంగళ హారతులు ఇస్తూ, కోలాటాలు, భజనలతో స్వామివారికి ఘన నీరాజనాలు అర్పించారు. భక్తుల గోవింద నామస్మరణలు, కృష్ణుడి భజనలతో కత్తిపూడి వీధులు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. అనంతరం భక్తులకు కమిటీ నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం సాయంత్రం స్థానిక ప్రాంగణంలో సంప్రదాయబద్ధంగా ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు.స్థానికులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఉట్టి కొట్టే పోటీలో ఆద్యంతం ప్రతిభ కనబరిచి ఉట్టి కొట్టిన గింజల స్వామి విజేతగా నిలిచారు.విజేతకు శ్రీ స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎన్ఎస్ఆర్



ప్రత్యేకంగా అందించిన శ్రీకృష్ణ భగవానుడి చిత్రపటాన్ని ప్రధాన బహుమతిగా అందజేశారు. ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో చిత్రపటాన్ని గింజల స్వామికి గౌరవంగా అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ సంప్రదాయ క్రీడలు, సంస్కృతి, ఆచారాలను పరిరక్షించడంలో యువత ముందుకు రావడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు బొడ్డపు నూకరాజు, ఐతు రాజబాబు, ఇసరపు హరీష్, ఉప్పల శ్రీను, ఐతు శివ, బంధం రామకృష్ణ, చిడగల మణికంఠతో పాటు గ్రామ పురప్రముఖులు, యువత, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

# ప్రమాదంలో గాయపడిన కందుల జడ్జికి జనసేన నేత తుమ్మలపల్లి రమేష్ పరామర్శ

**త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి చేరుకోవాలని ఆకాంక్ష**



**గండేపల్లి,పెన్ పవర్, సెప్టెంబర్ 4:** గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట గ్రామానికి చెందిన కందుల జడ్జి ఇటీవల ప్రమాదానికి గురై రాజమహేంద్రవరంలోని సూర్య ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న జగ్గంపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ గురువారం ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు.

ఈ సందర్భంగా వైద్యులను అడిగి కందుల జడ్జి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న రమేష్, అనంతరం ఆయనను కలిసి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి తిరిగి రావాలని ఆకాంక్షించారు.

రమేష్ వెంట జనసేన నాయకులు దూది శ్రీనివాస్, మాదారపు వీరబాబు, కాయల మణికంఠ, గుంటముక్కల చిన్న, కొలమూరి బుజ్జి తదితరులు ఉన్నారు.

# కిర్లంపూడిలో విజ్ఞానభారతిలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు






**కిర్లంపూడి, పెన్ పవర్, సెప్టెంబర్ 04:**కాకినాడ జిల్లా మండల కేంద్రమైన కిర్లంపూడిలోని విజ్ఞాన భారతి హైస్కూల్ లో శుక్రవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలో 95 మంది విద్యార్థులు కృష్ణ వేషధారణ పోటీలలో పాల్గొన్నారు.కార్యక్రమంలో ఉదయం గణేష్ పూజ, కృష్ణ పూజ, గోపూజ, మధ్యాహ్నం కృష్ణ వేషధారణ పోటీలు, గోపిక వేషధారణ పోటీలు, ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.అనంతరం వేషధారణ పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు.న్యాయనిర్ణేతలుగా శ్రీ కంపరపు నాగేశ్వరరావు, దాడి సూరిబాబు, చిట్రా అప్పారావు వ్యవహరించారు.ముఖ్య అతిథులుగా కిర్లంపూడి మండల బిజెపి అధ్యక్షులు శరకణం రాజబాబు పాల్గొన్న ఈ కార్యక్రమంలో కంటా కాశీ విశ్వనాథం, పాబోలు సీతారామమూర్తి,, ఆర్ఎస్ఎస్ జగ్గంపేట ఖండ్ ప్రముఖ్, ప్రధానాచార్యులు గాడి శ్రీనివాసరావు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీకృష్ణుని సందేశం మానవాళికి స్ఫూర్తిదాయకం



**రామచంద్రపురం, పెన్ పవర్,సెప్టెంబర్ 4:** భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ అందించిన "యదా యదా హి ధర్మస్య..." మహోన్నత సందేశం యుగయుగాలుగా మానవాళికి ధర్మమార్గాన్ని చూపుతోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు.శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

ధర్మాన్ని స్థాపించేందుకు, సత్యాన్ని రక్షించేందుకు, మానవాళికి జీవన సారాన్ని బోధించేందుకు శ్రీకృష్ణుడు అవతరించారని మంత్రి పేర్కొన్నారు. ప్రేమ,కరుణ,జ్ఞానం,కర్తవ్యబోధ, నాయకత్వం వంటి గొప్ప విలువలకు శ్రీకృష్ణుడు ప్రతీకగా నిలిచారని తెలిపారు.శ్రీకృష్ణుని జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని,భగవద్గీత బోధనలు నేటి సమాజంలోనూ ఎంతో ప్రాసంగికమని అన్నారు.క్లిష్ట పరిస్థితుల్లో ధైర్యంగా ముందుకు సాగాలని, ధర్మబద్ధంగా జీవిస్తూ సమాజ శ్రేయస్సు కోసం కృషి చేయాలని గీతా సందేశం బోధిస్తోందన్నారు.శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ప్రతి ఇంటా ఆనందాలు వెల్లివిరియాలని,ప్రజలందరూ ఆయురారోగ్యాలు,సుఖసంతోషాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో మరింత పురోగతి సాధించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ధర్మం, సత్యం, సేవాభావం అనే శ్రీకృష్ణుని బోధనలను ఆచరిస్తూ సమాజాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# ప్రతి కుటుంబంలో ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు సిద్ధించాలి

**కాకినాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 4:** శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని కాకినాడ నగరంలోని పలు దేవాలయాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రతోత్సవాలను భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు జగన్నాథపురంలోని శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ సర్వేశ్వర స్వామి ఆలయం, జగన్నాథపురం చిన్న మార్కెట్ ప్రాంగణంలోని శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో నిర్వహించిన సామూహిక వరలక్ష్మీ వ్రత పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వందలాది మంది మహిళలు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ లోకకల్యాణార్థం ప్రతి కుటుంబంలో ఆయురారోగ్యాలు,అష్టైశ్వర్యాలు సిద్ధించాలని మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరిస్తారని తెలిపారు. హైందవ సంస్కృతిలో వరలక్ష్మీ వ్రతానికి ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. సామూహికంగా నిర్వహించే ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా సమాజంలో ఐక్యత, భక్తిభావం మరింత పెంపొందుతాయని పేర్కొన్నారు.

కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు మేడిశెట్టి వీరభద్రరావు,దుగ్గన రాజు,మేడిశెట్టి చిన్ని,చొక్కా గిరి,పిర్ల లక్ష్మీ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.






# శ్రీ కృష్ణుడి కృపాకటాక్షాలతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి.



-శ్రీకృష్ణ ఆలయాల సందర్శన కార్యక్రమాల్లో ఎన్ఆర్ఐ శశియాదవ్.



**ప్రత్తిపాడు,పెన్ పవర్, సెప్టెంబర్, 04:**శ్రీకృష్ణుడి కృపాకటాక్షాలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో,సుభిక్షంగా ఉండాలని ఎన్ఆర్ఐ శశియాదవ్ ఆకాంక్షించారు.కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రజలందరికీ శ్రీకృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు.కృష్ణాష్టమి సందర్భంగా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కొలువుదీరిన శ్రీకృష్ణ ఆలయాలను ఎన్ఆర్ఐ శశి యాదవ్ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ధర్మవరం,పేరవరం, ఏలేశ్వరం,పెద శంకర్లపూడి,రౌతుపాలెం,గజ్జనపూడి,పోతులూరు,వాకపల్లి,శంఖవరం,కత్తిపూడి తదితర గ్రామాల్లోని శ్రీకృష్ణ ఆలయాలను దర్శించుకుని స్వామివారి ఆశీస్సులు పొందారు.శశి యాదవ్ పర్యటన సందర్భంగా ఆయా గ్రామాల్లో భక్తులు,యువత,ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు.భారీగా కార్లు,ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించగా,పలు గ్రామాల్లో పూలవర్షం కురిపిస్తూ ఘనంగా స్వాగతం పలికారు.కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా ఆలయాల వద్ద భక్తుల సందడి నెలకొంది.ఆయా గ్రామాల్లోని శ్రీకృష్ణ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన శశి యాదవ్..ఉట్టి కొట్టే కార్యక్రమాల్లో పాల్గొన్న విజేతలకు అందించేందుకు బహుమతులను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.శ్రీకృష్ణుడి జన్మదిన వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవడం ఆనందంగా ఉందని శశి యాదవ్ పేర్కొన్నారు.శ్రీకృష్ణుడి ఆశీస్సులతో ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో,శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

# ర్యాలిలో వైభవంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు





**భక్తిశ్రద్ధలతో విశేష పూజలు.. స్వామివారి సేవలో తరించిన భక్తజనం**


**ఆత్రేయపురం పెన్ పవర్ సెప్టెంబర్ 4:**ఆధ్యాత్మిక వైభవానికి, విశిష్టమైన దేవతా స్వరూపానికి ప్రసిద్ధిగాంచిన ర్యాలి గ్రామంలోని శ్రీ జగన్మోహిని కేశవ, గోపాల స్వామి దేవస్థానంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. క్షేత్రపాలకులైన శ్రీ గోపాల స్వామివారి సన్నిధిలో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఉత్సవాల్లో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం అనంతరం స్వామివారికి పంచామృత అభిషేకం నిర్వహించారు. అనంతరం చందనం, నవనీతములతో స్వామివారిని సుందరంగా అలంకరించి సహస్రనామ పూజ చేపట్టారు. అమ్మవార్లకు కుంకుమ పూజ, గోపూజ తదితర కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామివారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు.శ్రీ కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయానికి భక్తులు, దాతలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారి దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించి, ఆధ్యాత్మిక అనుభూతిని పొందారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.శ్రీ జగన్మోహిని కేశవ స్వామి దేవస్థానం విశిష్టత కారణంగా భక్తుల్లో ప్రత్యేక ప్రాధాన్యం కలిగి ఉంది. ఆలయంలోని మూలవిరాట్‌కు ముందు భాగంలో కేశవ స్వామి, వెనుక భాగంలో జగన్మోహిని రూపం దర్శనమివ్వడం ఈ క్షేత్ర ప్రత్యేకతగా భక్తులు భావిస్తారు.ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, కార్యనిర్వహణాధికారి, ద్వారపురెడ్డి సురేష్ బాబు ఆలయ సిబ్బంది తదితరులు స్వామివారి సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కృష్ణాష్టమి వేడుకలు ప్రశాంతంగా, భక్తిమయ వాతావరణంలో సాగడంతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

# ప్రజాదర్బార్‌తో ప్రజలకు భరోసా



- 39 వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.. ...
- సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు

**రావులపాలెం, పెన్ పవర్ సెప్టెంబర్ 4:**ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం చూపించడమే లక్ష్యంగా ప్రజాదర్బార్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ప్రజలకు భరోసా కల్పించడంతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో వారి చెంతకే వచ్చి వినతులు స్వీకరిస్తున్నామని తెలిపారు.రావులపాలెం మండలం దేవరపల్లి మట్లదొడ్డిలో శుక్రవారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల నుంచి ఎమ్మెల్యే స్వయంగా 39 వినతులను స్వీకరించి, ప్రతి సమస్యను ఓపికగా విని వివరాలు తెలుసుకున్నారు.వినతుల్లో ప్రధానంగా స్థానిక సమస్యలు, మౌలిక వసతులు, ప్రజా అవసరాలకు సంబంధించిన అంశాలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రజలు సమర్పించిన పలు వినతులపై ఎమ్మెల్యే అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు.ఇక మిగిలిన వినతులపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, సమస్యల స్వభావాన్ని పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వారి వద్దకే వచ్చి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజాదర్బార్ కార్యక్రమాలు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతిని అధికారులు బాధ్యతగా తీసుకుని పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని బండారు సత్యానందరావు హామీ ఇచ్చారు.
ప్రజల సమస్యలను నేరుగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చే అవకాశం లభించడంతో స్థానికులు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.





**కాకినాడ జిల్లా : పిఠాపురం పెన్ పవర్ సెప్టెంబర్ 4.**
ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం లో ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం పాదగయా క్షేత్రంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా భక్తి శ్రద్ధలతో సామూహిక వరలక్ష్మి వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు...
శ్రావణ శుక్రవారం సందర్భంగా ఐదు బ్యాచ్ లు లో సుమారు 12వేల మంది ఆడపడుచులు వరలక్ష్మీ వ్రతాలు ఆచరించేలా ఏర్పాట్లు చేసిన ఆలయ అదికారులు...
అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి సాంప్రదాయ బద్దంగా పూజా కార్యక్రమాలు ప్రారంభించిన పోలీస్ హౌసింగ్ బోర్డ్ చైర్మన్ కేకే , పెండెం దొరబాబు, తుమ్మలబాబు, పంతం నానాజీ...
వరలక్ష్మి వ్రత పూజ కార్యక్రమం అనంతరం పవన్ కళ్యాణ్ పంపించిన పసుపు , కుంకుమ, చీర , రూపు తో కూడిన కానుక గా అందించిన పోలీస్ హౌసింగ్ బోర్డ్ చైర్మన్ కె.కె , ఫైవ్ మ్యాన్ కమిటీ సభ్యులు పెండెం దొరబాబు, తుమ్మల బాబు , ఓదూరి కిషోర్ , జనసేన నాయకులు..

# వాడపల్లి ఆలయంలో వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు





**ప్రత్యేక అభిషేకాలు, విశేష అలంకరణలు.. భక్తిశ్రద్ధలతో పూజలు**

**ఆత్రేయపురం పెన్ పవర్ సెప్టెంబర్ 4:** కొనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రీకృష్ణాష్టమి పర్వదిన వేడుకలు వైభవంగా, భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించారు. శ్రీకృష్ణుని జన్మదినాన్ని పురస్కరించుకుని ఆలయ క్షేత్రపాలకుడైన శ్రీ వేణుగోపాల స్వామి వారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.
ఉదయాన్నే స్వామివారికి శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం నిర్వహించి, అనంతరం పవిత్ర జలాలతో అభిషేక కార్యక్రమాన్ని పూర్తి చేశారు. వివిధ సుగంధ ద్రవ్యాలు, పుష్పాలతో స్వామివారిని విశేషంగా అలంకరించి, ప్రత్యేక నైవేద్యాలను సమర్పించారు. అనంతరం మంగళహారతులు నిర్వహించి స్వామివారి ఆశీస్సులను భక్తులకు అందించారు.శ్రీకృష్ణాష్టమి సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలకు భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. పరిసర ప్రాంతాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని, తీర్థప్రసాదాలను స్వీకరించారు.ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలను నిర్వహించడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది. శ్రీ వేణుగోపాల స్వామి వారి దర్శనం కోసం వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. శ్రీకృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఉప కమిషనర్ నల్ల సూర్య చక్రధర్ రావు అవసరమైన ఏర్పాట్లు చేశారు. పూజా కార్యక్రమాలు ప్రశాంతంగా, సంప్రదాయబద్ధంగా ముగిశాయి. శ్రీకృష్ణాష్టమి వేడుకల సందర్భంగా వాడపల్లి క్షేత్రం భక్తి, ఆధ్యాత్మికతతో కళకళలాడింది.

## ర్యాలి సత్యవతి కుటుంబానికి టీడీపీ అండ



**ఆత్రేయపురం పెన్ పవర్ సెప్టెంబర్ 4 :** మండలంలోని ర్యాలి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యురాలు ర్యాలి సత్యవతి అకాల మరణం చెందడంతో ఆమె కుటుంబానికి టీడీపీ నాయకులు అండగా నిలిచారు. పార్టీ తరఫున అందిస్తున్న ప్రమాద బీమా పథకం ద్వారా సత్యవతి కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని శుక్రవారం ఆ కుటుంబ సభ్యులకుఅందించారు.
ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ పార్టీ కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. కుటుంబ సభ్యురాలిని కోల్పోయిన బాధలో ఉన్న కుటుంబానికి ఆర్థిక సహాయం కొంతమేర భరోసా కల్పిస్తుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో ర్యాలి గ్రామ టీడీపీ అధ్యక్షులు పెండెం వెంకన్న, యూనిట్ ఇన్‌చార్జ్ కందుల రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి గుడేల నాగేంద్ర గౌడ్, మెర్ల నాగేశ్వరరావు, బూట్ ఇంచార్జ్ అత్తిలి చిరంజీవి. చేకూరి సత్తిపండు , అమర్ తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సత్యవతి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక కృషి

- రూ.20 లక్షలతో నిర్మించిన మండల పరిషత్ పాఠశాల భవనం ప్రారంభం





**రావులపాలెం పెన్ పవర్ సెప్టెంబర్ 4:**కూటమి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శుక్రవారం రావులపాలెం మండలం దేవరపల్లి శివారు తిమ్మప్ప దొడ్డిలో మండల ప్రజా పరిషత్ నిధులు రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించిన మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను నూతన పాఠశాల భవనంలో అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. విద్యార్థులు సౌకర్యవంతమైన వాతావరణంలో విద్యనభ్యసించేందుకు పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.
గతంలో ప్రభుత్వ పాఠశాలలపై కొంత చిన్నచూపు ఉండేదని, అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పిస్తే వారు కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులకు దీటుగా ప్రతిభ కనబరచగలరని అన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు అవసరమైన అన్ని రకాల సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే తెలిపారు. నూతన పాఠశాల భవనం అందుబాటులోకి రావడంతో తిమ్మప్ప దొడ్డి ప్రాంతంలోని విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.

## నేడు కాంగ్రెస్ పార్టీ జెండా పండుగ ప్రారంభోత్సవ కార్యక్రమం



**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 4 :** ఈనెల 5వ తేదీన కాకినాడలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించే ప్రతిష్టాత్మకమైన కాంగ్రెస్ పార్టీ జెండా పండుగ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా హాజరు కావాలని జగ్గంపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మరోతి శివ గణేష్ కోరారు. కేంద్ర మాజీ మంత్రి ఎం ఎం పల్లంరాజు ఆదేశాలతో కాకినాడ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ప్రతి గ్రామంలో కాంగ్రెస్ జెండా ఎగరవేసి కాంగ్రెస్ నాయకుల ఇళ్లపై జెండా రెపరెపలాడించడం ఈ కార్యక్రమం ఉద్దేశమని కొన్ని నెలల పాటు నిర్విరామంగా జరుపుతామని శివ గణేష్ పేర్కొన్నారు.

# ఇర్రిపాకలో అష్టలక్ష్మి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నెహ్రూ



**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 4:** జగ్గంపేట మండలం ఇర్రిపాక శివకేశవుల క్షేత్రంలో అష్టలక్ష్మి సమేత లక్ష్మీనారాయణుడు ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన మహోత్సవం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఎమ్మెల్యే, టిటిడి బోర్డు సభ్యులు, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల మణెమ్మ దంపతులు పీటలపై కూర్చుని ఈ శంకుస్థాపన మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్, లక్ష్మీదేవి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ ద్వారా 40 లక్షల రూపాయలు అష్టలక్ష్మి గుడికి, అదేవిధంగా రేపు అయోధ్య రామ మందిరం పోలిన రామాలయం నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహిస్తున్నామని ఆ రామాలయానికి 40 లక్షలు అందించడం జరిగిందని ఈ రెండు దేవాలయాలను భక్తుల సహకారంతో అత్యంత సుందరంగా నిర్మిస్తామన్నారు. ఇర్రిపాక క్షేత్రాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని, అష్టలక్ష్మి ఆలయంతో క్షేత్రానికి మరింత విశిష్టత వస్తుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, టిడిపి, జనసేన, బిజెపి కూటమి నాయకులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## జగ్గంపేట హ్యాపీ చిల్డ్రన్ స్కూల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు




**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 4:** జగ్గంపేట-గుర్రపాలెం రోడ్ తులా కాంప్లెక్స్ లో చిల్డ్రన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి ముందస్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణ, గోపికమ్మల వేషధారణలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ నకిరెడ్డి నాగేశ్వరావు మాట్లాడుతూ శ్రీకృష్ణాష్టమి విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తారన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులతో ఉట్టి కొట్టించారు. విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫార్మసీ విద్యారంగంలో విశేష సేవలకు గుర్తింపు

**ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డా. కె. రవిశంకర్‌కు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు**



**గండేపల్లి,పెన్ పవర్, సెప్టెంబర్ 4:** సూరంపాలెంలోని ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డా. కె. రవిశంకర్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2025--26 సంవత్సరానికి రాష్ట్ర ఉత్తమ ఫార్మసీ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేసింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు అందినట్లు ఆదిత్య యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డా. ఎన్. సతీష్ రెడ్డి తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డా. రవిశంకర్ విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలనే సంకల్పంతో నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. ఫార్మసీ రంగంలో నూతన ఆవిష్కరణలు, పరిశోధనలకు విశేషంగా కృషి చేస్తూ పలు విలువైన పుస్తకాలను రచించారని తెలిపారు.

క్లినికల్ ఫార్మసీ అండ్ ఫార్మాకోథెరప్యూటిక్స్, ఫార్మసీ కాలేజీ--ఏ కాంప్రెహెన్సివ్ అప్రోచ్, కంపానియన్ హ్యాండ్‌బుక్, సోషల్ అండ్ ప్రివెంటివ్ ఫార్మసీ తదితర పుస్తకాలను రచించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చారని చెప్పారు. అదేవిధంగా ఇన్ విట్రో యాక్టివిటీస్ ఆఫ్ ఆస్పరాగస్ రేసిమోసస్ రూట్ ఎక్స్‌ట్రాక్ట్స్, ఫార్మకాలాజికల్ యాక్టివిటీస్ ఆఫ్ ఆండ్రోగ్రాఫిస్ సెర్ఫిల్లిఫోలియా వంటి పరిశోధనా గ్రంథాలను కూడా ప్రచురించారని వివరించారు.

దేశ, విదేశాల్లో నిర్వహించిన అనేక జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని విజ్ఞానదాయకమైన ఉపన్యాసాలు అందించడంతో పాటు, జేఎన్‌టీయూకే, ఆంధ్రా యూనివర్సిటీ, కాకతీయ యూనివర్సిటీ, నాగార్జున యూనివర్సిటీ, డా. ఎం.జీ.ఆర్. యూనివర్సిటీలకు ఎగ్జామినర్‌గా సేవలందించారని తెలిపారు. చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ సభ్యుడిగా, పలు ప్రముఖ జర్నల్ల ఎడిటోరియల్ బోర్డుల్లో సభ్యుడిగా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.

ఫార్మసీ విద్యా రంగంలో డా. రవిశంకర్ చేసిన విశేష కృషికి గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఫార్మసీ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేయడం అభినందనీయమని డా. సతీష్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా డా. రవిశంకర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆదిత్య యూనివర్సిటీ ఛాన్సలర్ డా. ఎన్. శేషారెడ్డి, డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాసరెడ్డి, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం.బి. శ్రీనివాస్, రిజిస్ట్రార్ డా. జి. సురేష్, ప్రో వైస్ ఛాన్సలర్లు, వివిధ విభాగాల డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది డా. రవిశంకర్‌కు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు విప్పర్తి సూర్యచంద్రం ఎంపిక

**నరసన్నపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయినికి అరుదైన గౌరవం**



**ఆత్రేయపురం పెన్ పవర్ సెప్టెంబర్ 4:** ఆత్రేయపురం శివారు నరసన్నపేట ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయినిగా విధులు నిర్వహిస్తున్న విప్పర్తి సూర్యచంద్రం 2026 సంవత్సరానికి సంబంధించిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు.జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయినట్లు మండల విద్యాశాఖ అధికారులు పీవీ ప్రసాదరావు, ఎ. సత్యనారాయణ తెలిపారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల ప్రతిభను వెలికితీయడం, బోధనలో వినూత్న పద్ధతులను అనుసరించడం వంటి అంశాల్లో ఆమె అందించిన సేవలను గుర్తించి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

గురుపూజోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 5న అమలాపురంలోని కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. గౌరవ ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారుల సమక్షంలో విప్పర్తి సూర్యచంద్రంను ఘనంగా సత్కరించి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందజేయనున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక కావడం పట్ల నరసన్నపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాశాఖ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఆమెకు అభినందనలు తెలియజేస్తూ, ఈ అవార్డు ఉపాధ్యాయ వృత్తిలో మరింత బాధ్యతతో పనిచేసేందుకు ప్రోత్సాహాన్ని అందిస్తుందని పేర్కొన్నారు.


# జనసేన ముసుగులో విభేదాలు సృష్టిస్తే సహించేది లేదు-పోలం చిన్నా...




- జనసేన ముసుగులో వైసీపీ నేతల రాజకీయాలు సాగవు....
- కూటమి నేతల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు మానుకోవాలి....
- అభివృద్ధి జరుగుతుంటే వివాదాలు సృష్టించడం తగదు.....
- వాస్తవాలు పరిశీలించే మీడియా ప్రతినిధులు వార్తలు ప్రచురించాలి-పోలం చిన్నా....

**శంఖవరం పెన్ పవర్ సెప్టెంబర్ 04:-** కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కొందరు వైసీపీ నాయకులు జనసేన ముసుగులో కూటమి పార్టీల నేతల మధ్య విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని మండపం టీడీపీ నేత పోలం చిన్న ఆరోపించారు ఇలాంటి రాజకీయాలు మండపం గ్రామంలో చెల్లవని హెచ్చరించారు.రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా కొందరు వ్యక్తులు వివాదానికి తెరతీసి టీడీపీ నాయకుడిపై దాడికి పాల్పడ్డారని,ఈ ఘటనలో ఆయన తీవ్రంగా గాయపడి కాలు విరిగినట్లు పోలం చిన్నా పేర్కొన్నారు.ఈ ఘటనపై ఇప్పటికే అన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.ఈ ఘటనను టీడీపీ,జనసేన మధ్య విభేదాలుగా చిత్రీకరించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. జనసేన నాయకులుగా చెప్పుకుంటున్న వారు ఎవరి సమక్షంలో పార్టీలో చేరారో వెల్లడించాలని డిమాండ్ చేశారు.గతంలో ఆయా వ్యక్తులు ఏ రాజకీయ పార్టీకి పనిచేశారు, ఎన్నికల సమయంలో ఎవరికి మద్దతుగా వ్యవహరించారు,కూటమి అభ్యర్థులకు వ్యతిరేకంగా పనిచేశారా అనే అంశాలను పరిశీలించిన తర్వాతే వార్తలను ప్రచురించాలని మీడియా ప్రతినిధులను కోరారు.జనసేన ముసుగులో వచ్చి కూటమి పార్టీల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని పోలం చిన్నా పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ నాయకత్వంలో మండపం గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసుకుంటున్నామని అన్నారు. గ్రామంలో అభివృద్ధి జరుగుతున్న సమయంలో అనవసర వివాదాలు సృష్టించడం తగదని హితవు పలికారు. వాస్తవాలను పూర్తిస్థాయిలో పరిశీలించి ప్రజలకు సరైన సమాచారం అందించాలని మీడియా ప్రతినిధులను కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భక్త శ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు.....



**శంఖవరం పెన్ పవర్ సెప్టెంబర్ 04:-** శ్రీకృష్ణుని జన్మదిన వేడుకలు రాష్ట్ర వ్యాప్తంగా భక్తులు ఘనంగా జరుపుకున్నారు కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడి లో వేంచేసి ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ఆవరణలో గల శ్రీ వేణుమాధవ్ స్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు .సుందరంగా అలంకరించిన వేదికపై స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి వివిధ రకాల పుష్పాలతో స్వామివారికి పూజలు నిర్వహించారు. పూజల్లో భాగంగా ఆలయ చైర్మన్ కాలింగ్ నూకరాజు ఆధ్వర్యంలో పురోహితులు వేమకోటి త్రినాథ్ శర్మ సత్య నారాయణ శర్మ వేదమంత్రోచ్ఛర్లనల మధ్య విఘ్నేశ్వర పూజ, శుద్ధి పుణ్యాహవాచనం , మండపారాధన నవగ్రహారాధన ,శ్రీ సూక్తం పురుష సూక్తం రుద్ర నమకం చమకం, అష్టోత్తర శతనామం తో పాటు స్వామివారికి పంచామృత అభిషేకం గావించారు . అనంతరం మంత్రపుష్పం నీరాజనం నిర్వహించారు. ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. స్వామివారి నూతన పట్టు వస్త్రాలు వివిధ జాతుల పుష్పమాలలతో అలంకరించడంతో స్వామి వారు దేదీప్యమానంగా దర్శనమిచ్చురు. అనంతరం పలువురు చిన్నారులు శ్రీకృష్ణుని వేషధారణలో వచ్చి స్వామివారి దర్శించుకున్నారు . గ్రామస్తులు భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు

## అభివృద్ధి అంటే రైతు పండించిన పంటను కూల్చడమా



**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 4:** కాకినాడ జిల్లా జగ్గంపేట గ్రామపంచాయతీ పరిధి జటాద్రి కొండపై గత 40 సంవత్సరాల నుంచి పేద రైతులు మామిడి, జీడి మామిడి పండించుకొని జీవనం సాగిస్తున్నారు. ఆ పంటను ప్రభుత్వం పీ ఎం కుసుమ సోలార్ ప్రాజెక్ట్ కింద పేదప్రజల పండించిన, పెంచుకున్న చెట్లను జెసిబిలతో తీసివేయడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం, కొత్తూరు గ్రామ నాయకులు, జగ్గంపేట ఇండిపెండెంట్ అభ్యర్థి పాఠంశెట్టి సూర్యచంద్ర బృందం, రైతులతో కలిసి శుక్రవారం జటాద్రి కొండపైకి వెళ్లి పనులు చేస్తున్న జెసిబి ని అడ్డుకొని, పని ఆపివేసి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇండిపెండెంట్ అభ్యర్థి పాటంశెట్టి సూర్యచంద్ర, ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్ణాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ దేశానికి, రాష్ట్రాలకు రైతే రారాజు అని చెప్పుకుంటున్న ఈ ప్రభుత్వాలు ఎంతో కష్టపడి, కావులతో కొండపైకి నీళ్లు మోసి పంట పండించుకుంటే, ప్రభుత్వ పథకాలు పేరు చెప్పి రైతుల పొట్ట కొట్టడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. ఈ దోపిడీ వ్యవస్థలో రైతులు బతికే ప్రసక్తే లేదా అని ప్రశ్నించారు. రెవిన్యూ యంత్రాంగం మాత్రం చూసి చూడనట్లు వ్యవహరిస్తుందని, బడా భూస్వాములకు వత్తాసు పలుకుతున్నారని ఆయన విమర్శించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జటాద్రి కొండపై ప్రాజెక్ట్ పెట్టనీయమని,రైతుల పక్షాన ఉండి ఎంతైనా పోరాటం చేస్తామని, కూటమి ప్రభుత్వం పేద రైతుల విషయంలో ఇలాగే వ్యవహరిస్తే భవిష్యత్తులో ప్రజాగ్రహానికి గురికాక తప్పని ఆయన హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కడితి సతీష్, రామలింగేశ్వరరావు, జాను, ఇండిపెండెంట్ అభ్యర్థి పాఠంశెట్టి సూర్యచంద్ర బృందం, కొత్తూరు గ్రామ నాయకులు నకిరెడ్డి నాగేశ్వరరావు, పెదకాపు, రైతులు నూకరాజు, శ్రీనివాసరావు, నాని, నాగేంద్ర, గంగరాజు, ధర్మరాజు,తదితరులు పాల్గొన్నారు.

# సోలార్ ప్లాంట్ కేటాయింపు ఉత్తర్వులు రద్దు చేయాలి.



-ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకు లంపకలోవ ఎస్సీ రైతులు వినతి.


**కిర్లంపూడి,ప్రత్తిపాడు,పెన్ పవర్, సెప్టెంబర్, 04:**సోలార్ ప్లాంట్ కేటాయింపు ఉత్తర్వులు రద్దు చేయాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజాకు మండలంలోని లంపకలోవ గ్రామానికి ఎస్సీ రైతులు వినతిపత్రం అందజేశారు.

ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 4/3ఏ, ఎల్పీఎం నంబర్కు సంబంధించిన 18.746 ఎకరాల భూమిలో లంపకలోవ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన రైతులు ఏళ్ల తరబడి సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామని,ఆ భూమిలో సోలార్ ప్లాంట్ ఏర్పాటు కోసం చేసిన కేటాయింపులను రద్దు చేయాలని కోరారు.జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ భూమిలో 10 ఎకరాలను పీఎం-కుసుమ్ కాంపోనెంట్-సీ (ఫీడర్ లెవల్ సోలరైజేషన్ స్కీమ్) కింద సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు రైతులు తెలిపారు.ఈ నిర్ణయంతో తమ జీవనాధారమైన భూములు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడిలో లంపకలోవ నాయకులు గొంతిన సురేష్,చక్కపల్లి నవీన్ ఆధ్వర్యంలో రైతులు ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభను కలిసి వినతిపత్రం అందజేశారు.సోలార్ ప్లాంట్ కోసం భూమి కేటాయిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయించి,ఏళ్ల తరబడి భూమిని సాగు చేసుకుంటున్న తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే సత్యప్రభను కోరారు.ఈ కార్యక్రమంలో బీరా దేవతయ్య,బోడపాటి ఏసుబాబు,తొర్ల విజేంద్ర,బొడ్డు అచ్చారావు,కింతాడ యతిమాని,చిన్నం నానీబాబు,సుంకర రాజులమ్మ,గుమ్మాల వీరలక్ష్మి,పులకపురి మరియమ్మతో పాటు సుమారు 40 మంది కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజలకు సీఎంఆర్ఎఫ్ పై అవగాహన కల్పించడమే లక్ష్యం.

-ఇంటింటికి సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో జ్యోతుల నవీన్ కుమార్.





**కిర్లంపూడి, పెన్ పవర్, సెప్టెంబర్, 04:**జగ్గంపేట నియోజకవర్గంలో ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి పై అవగాహన కల్పించేందుకే మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను ఇంటింటికి వెళ్లి పంపిణీ చేస్తున్నామని కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ తెలిపారు.కిర్లంపూడి మండలంలో సోమవరం 1, బూరుగుపూడి 2, గోనేడ శృంగరాయునిపాలెం 4, ఎస్ తిమ్మాపురం 1, భూపాలపట్నం 2, పెద్దనాపల్లి 1, చిల్లంగి, జగపతినగరం, కిర్లంపూడి 6, రామకృష్ణాపురం 2, వీరవరం 1 మొత్తం 25 మందికి జగ్గంపేట శాసనసభ్యుడు జ్యోతుల నెహ్రూ కృషితో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన 16.50 లక్షల చెక్కులను నవీన్ చేతుల మీదుగా బాధిత కుటుంబాలకు అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు.అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు రాజకీయాలకు అతీతంగా చేయూతనివ్వడమే లక్ష్యంగా జగ్గంపేట నియోజకవర్గంలో ముందుకు సాగుతున్నామని, అందుకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేస్తున్న కృషి ఎంతో ఉందని జ్యోతుల నవీన్ కుమార్ అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిపి తోట రవి,వీరవరం, కిర్లంపూడి సొసైటీ అధ్యక్షులు తోట గాంధీ,కుర్ల చినబాబు,నీలం శ్రీను, అనుకుల శ్రీకాంత్,జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ సభ్యులు చదరం చంటిబాబు, తూము కుమార్, కాళ్ల వెంకటేష్, పాఠంశెట్టి మురళీకృష్ణ, జంపన రవివర్మ, కుంచే తాతాజీ, పాఠం శెట్టిరవి,మురా సత్తిబాబు గొడే బాల, పట్టు చంటిబాబు, బొజ్జపు శ్రీను, కరణం బూరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 5 నుంచి 11వ తేదీ వరకు ఉంగుటూరు రైల్వే గేటు మూత



**పెన్ పవర్ -- ఉంగుటూరు, సెప్టెంబర్ 04:**ఉంగుటూరు: విజయవాడ--విశాఖ రైలు మార్గంలోని ఉంగుటూరు రైల్వే గేటును ఈనెల 5వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 11వ తేదీ వరకు వారం రోజుల పాటు తాత్కాలికంగా మూసివేయనున్నారు. రైల్వే ట్రాక్ పటిష్టత, నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో రైల్వే క్రాసింగ్ గేటును మూసివేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

గేటు మూసివేత కారణంగా వాహనదారులు, ప్రజలు ముందుగానే ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని ఉంగుటూరు పంచాయతీ అభివృద్ధి అధికారి బీవీ రవిచంద్రకుమార్ సూచించారు. రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ జారీ చేసిన ప్రకటన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

## జగ్గంపేట మండలంలో సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 4:** జగ్గంపేట మండలంలో ముఖ్యమంత్రి సహాయనిధి కింద 17 మందికి రూ.6,53,346 విలువైన చెక్కులను శుక్రవారం ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ హాజరై రామవరం ఒకటి, జే కొత్తూరు 2, సగరపేట ఒకటి, రాజపూడి 10, వెంగయమ్మపురం ఒకటి, మల్లిసాల 2, మొత్తం 17 మంది ఇళ్లకు స్వయంగా వెళ్లి ప్రభుత్వం నుంచి వచ్చిన చెక్కులను అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా జ్యోతుల నవీన్ మాట్లాడుతూ అనారోగ్యం బారిన పడివైద్యం చేయించుకోలేని పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు వరంగా మారాయని అన్నారు. ప్రజలకు అండగా ఉండటమే జ్యోతుల నెహ్రూ లక్ష్యమని, ఎవరూ అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ప్రతి ఇంటికి వెళ్లి మరీ చెక్కులు అందిస్తున్నామని అన్నారు. దీనివల్ల పదిమందికి తెలిసి ఇంకా ఎవరైనా అనారోగ్యంగా ఉండి వైద్యం చేయించుకున్న వారు సీఎంఆర్ఎఫ్ దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి ఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, మారిశెట్టి భద్రం, దేవరపల్లి మూర్తి, అడబాల వెంకటేశ్వరరావు, పైడిపాల సూరిబాబు, రేఖ బుల్లి రాజు, పాండ్రంగి రాంబాబు, చింతల కన్నారావు, బస్వా చిన్నబాబు, అడబాల రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 4:** శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని జగ్గంపేట మండలంలోని వివిధ ప్రాంతాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, శ్రీ స్వామి వివేకానంద విద్యా సంస్థల అధినేత ఒమ్మి రఘురామ్ గుర్రంపాలెం, రామవరం, జగ్గంపేటలో శ్రీకృష్ణ ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శ్రీకృష్ణ పరమాత్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సౌభాగ్యం కలగాలని ఆకాంక్షించారు. జన్మాష్టమి సందర్భంగా ఆలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతులు నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో సందడి చేయగా, భక్తులు భక్తిగీతాలు, కీర్తనలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి




**కాజులూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 4:** భారతీయ జనతా పార్టీ కాజులూరు మండల శాఖ నెలవారీ పదాధికారుల సమావేశం మండల అధ్యక్షుడు పుణ్యమంతుల శివాజీ నేతృత్వంలో శుక్రవారం అయితపూడి గ్రామంలో నిర్వహించారు. మండల ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి వీరభద్రం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జిల్లా ప్రధాన కార్యదర్శి సలాది వీరబాబు, మండల ఇన్చార్జి సలాది శేఖర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మండల ఇన్చార్జి సలాది శేఖర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరిగినా పోటీ చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సూచించారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సమష్టిగా కృషి చేయాలని కోరారు.జిల్లా ప్రధాన కార్యదర్శి సలాది వీరబాబు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశ అభివృద్ధి కోసం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వాట్సాప్ తదితర సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు.కేంద్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను గ్రామస్థాయిలో ప్రజలకు చేరవేయడం ద్వారా భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేసి, రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. తదనంతరం బిజెపి సీనియర్ నాయకులు మండల ఉపాధ్యక్షులు పెద్దిరెడ్డి వీరభద్రం ని పార్టీ నాయకులు దుశ్శాలువాతో సన్మానించారు. సమావేశంలో జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కె.శ్రీనివాసరెడ్డి, ఆదినారాయణ,తలాటం అమ్మాజీ, ముషిని ఏడుకొండలు,మండల ఉపాధ్యక్షులు, మండల ప్రధాన కార్యదర్శులు వాసంశెట్టి రామకృష్ణ, నిమ్మన రాజేష్,సాయి తదితర నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.


## సామర్లకోట మండలం అచ్చంపేటలో మాజీ మంత్రివర్యులు యనమల రామకృష్ణుడు






**సామర్లకోట రూరల్... పెన్ పవర్.. సెప్టెంబర్ 4..**,పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప,మాజీ ఎమ్మెల్యే ఎస్.వి.ఎస్.ఎన్. వర్మ , పెద్దాపురం నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు సమావేశమై, ప్రస్తుతం కాకినాడ జిల్లాలో అమలవుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాల పురోగతి, అలాగే భవిష్యత్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించారు.నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి ప్రజల అవసరాలు, ప్రాధాన్యతా అంశాలు, ప్రభుత్వం ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరువ చేయడం వంటి అంశాలపై నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.ఈ సమావేశంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు , కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులునిమ్మకాయల రంగనాగ్,ముసిరెడ్డి శ్రీరాములు,తోటకూర శ్రీనివాస్ గుమ్మళ్ళ రామకృష్ణ, కంటె మెహన్ జగదీష్ బాబు, యార్లగడ్డ చిన్ని,నూనె రామారావు , పేకేటి దొరబాబు, తోట నాగభూషణం క తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్న గొంప శివకుమార్ యాదవ్.






**ఏలేశ్వరం, పెన్ పవర్, సెప్టెంబర్ 4:** స్థానిక దిబ్బల పాలెం కృష్ణాలయం లో గ్రామ పెద్దలు శుక్రవారం నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో గొంప శివకుమార్ యాదవ్ పాల్గొన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గం బీసీవై పార్టీ ఇంచార్జ్ గొంప శివకుమార్ యాదవ్ మండల పరిధిలో లింగంపర్తి, ఏలేశ్వరం గ్రామాల్లో పర్యటించి శ్రీ కృష్ణుడు ఆలయాల్లో కొలువైన శ్రీకృష్ణుని దర్శించుకుని, వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా శివకుమార్ యాదవ్ మాట్లాడుతూ ఆ శ్రీ కృష్ణ భగవంతుడు ని దయ వల్ల ప్రత్తిపాడు నియోజకవర్గం ప్రజలు అందరు సుఖ సంతోషాలతో ఉండాలని భగవంతుని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో సి. రాయవరం మాజీ సర్పంచ్ దేవర శ్రీను, యువత, ప్రజలు, బీసీవై పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# విద్యుత్ సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలి.





ఎమ్మెల్యే సత్యప్రభ విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశం.

**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, సెప్టెంబర్, 04:** ప్రత్తిపాడు నియోజకవర్గంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించి ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందేలా చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆదేశించారు. పెద శంకర్లపూడి టీడీపీ కార్యాలయం వద్ద శుక్రవారం జగ్గంపేట డీఈఈ వీరభద్రరావు, నియోజకవర్గంలోని నాలుగు మండలాల విద్యుత్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలపై ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. విద్యుత్ సరఫరా, విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు తదితర అంశాలకు సంబంధించి ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆయా సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు విద్యుత్ సరఫరా విషయంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు. అంతకుముందు ఎమ్మెల్యే ప్రజా దర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చి తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. బాధితుల సమస్యలను ఎమ్మెల్యే శ్రద్ధగా విని, సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి అధిక శాతం సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు. తక్షణ పరిష్కారం సాధ్యం కాని సమస్యలను ఆయా శాఖల అధికారులతో సమన్వయం చేసి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ స్పష్టం చేశారు.


03

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

కోర్టు పబ్లికేషన్ యాడ్స్

కేవలం

యాడ్ 500/-

'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి


# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో మెరుగైన రహదారి వ్యవస్థ అత్యంత కీలకం.

రూ.1.50 కోట్ల సాస్కీ నిధులతో నిర్మించనున్న రెండు బీటీ రోడ్లకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే బండారు..



**ఆలమూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 04:** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో మెరుగైన రహదారి వ్యవస్థ అత్యంత కీలకమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుదలకు రహదారులు తోడ్పడతాయని తెలిపారు. శుక్రవారం ఆయన నియోజకవర్గంలోని దేవరపల్లి, ఆలమూరు గ్రామాల్లో రూ. 1.50కోట్ల సాస్కీ నిధులతో చేపట్టిన రెండు బీటీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. తొలుత రూ. 60లక్షలతో నిర్మించనున్న దేవరపల్లి శివారు మట్టలదొడ్డి రహదారికి భూమి పూజ నిర్వహించారు. అనంతరం రూ. 90 లక్షలతో ఆలమూరు పల్లిపేట నుంచి సూర్యారావుపేట వరకు నిర్మించనున్న బీటీ రోడ్డుకు భూమి పూజ నిర్వహించారు. తదుపరి ఆలమూరులో రూ. 80 లక్షల రూపాయలతో నిర్మించిన సీసీ రహదారులను ప్రారంభించారు.

# నిరుపేద కుటుంబాలకు అండగా ఉండడమే తన లక్ష్యం.

-వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మురళీకృష్ణంరాజు.





**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, సెప్టెంబర్, 04:** నిరుపేద కుటుంబాలకు అండగా ఉండడమే తన లక్ష్యమని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు, ప్రత్తిపాడు నియోజకవర్గం వైసీపీ నాయకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు. ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో పలు కుటుంబాలను పరామర్శించి పలువురికి ఆర్థిక సహాయం అందజేశారు.

ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన అనసూరి చిట్టిబాబు ఇటీవల కాలంలో అకాల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మురళీకృష్ణరాజు వారు కుమారులు ఇద్దరిని, కుటుంబ సభ్యులు పరామర్శించి చిట్టిబాబు కుటుంబానికి ధైర్యం చెప్పి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి పలికి వారి పవిత్ర ఆత్మకు చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థించారు. ఆ నిరుపేద కుటుంబాలకు 5000 రూపాయలు ఆర్థిక సాయం అందజేసారు. అదే గ్రామానికి చెందిన జెడ్డాపావయ్య (ప్రసాద్ ) ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మురళీకృష్ణంరాజు ప్రసాద్ భార్య లోవతల్లిని పరామర్శించి తీవ్ర ప్రగాఢ సంతాపాన్ని తెలియజేయడమే కాకుండా, ఆ కుటుంబానికి ధైర్యం చెప్పి 5000 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ధర్మవరం గ్రామానికి చెందిన అనుసూరి రాంబాబు సోదరుడు గణేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి దంతాలకు ఆపరేషన్ చేయించుకున్నారు. లక్ష్మీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గణేష్ ని పరామర్శించి వైద్య ఖర్చులకు 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. అదే గ్రామానికి చెందిన దాడి కుమార్ రోడ్డు ప్రమాదంలో చేతికి ఆపరేషన్ చేయించుకున్నారు. విషయము తెలుసుకున్న మురళీకృష్ణంరాజు కుమార్ ను పరామర్శించి వైద్య ఖర్చులకు 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.

ఈ కార్యక్రమంలో కోలా తాతబాబు, దాడి పుత్రయ్య ,రాయుడు దొరబాబు ,చిలకలపల్లి శ్రీను ,అనసూరి రాంబాబు ,ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు

# శ్రీకృష్ణుని ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలి


-వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మురళీకృష్ణంరాజు



**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, సెప్టెంబర్, 04:** శ్రీకృష్ణుని ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలని, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు, ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీ కృష్ణంరాజు అన్నారు. ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా శ్రీ కృష్ణ యాదవ్ ఆలయ కమిటి ఆహ్వానం మేరకు శుక్రవారం జగనన్న కాలనీ వద్ద ఉన్న కృష్ణుడి గుడి దగ్గర స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కోలా తాతబాబు ,జువ్వల దొరబాబు, దాడి పుత్రయ్య , కోన బాబ్జి, గోనగాని రామకృష్ణ, పల్లా రాంబాబు ,ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు

# గండేపల్లిలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

1977 నుంచి కొనసాగుతున్న సంప్రదాయం.. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు



**గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 4:** గండేపల్లి గ్రామంలో యాదవ సంఘం, శ్రీకృష్ణ యూత్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని మామిడి తోరణాలు, వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

స్వామివారికి నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో నీలపాల రామకృష్ణ దంపతులు పాల్గొనగా, వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య శ్రీకృష్ణ స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా యాదవ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ గండేపల్లి గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను 1977 సంవత్సరం నుంచి ప్రతి ఏటా అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. 1977లో యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ ఆలయాన్ని నిర్మించామని, అప్పటి నుంచి ఆలయంలో నిత్య పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు.

ప్రతి సంవత్సరం శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ, భక్తులకు స్వామివారి దర్శన సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. శుక్రవారం సాయంత్రం కూడా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వేడుకల్లో యాదవ సంఘం సభ్యులు, శ్రీకృష్ణ యూత్ సభ్యులు, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

# గండేపల్లి మండలానికి ఇద్దరు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు

**ఉత్తమ సేవలకు గుర్తింపుగా జిల్లా స్థాయి అవార్డులకు ఎంపిక**

**గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 4:**
గండేపల్లి మండలానికి చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 5న జిల్లా కలెక్టర్, ఇన్‌చార్జి మంత్రి చేతుల మీదుగా ఈ అవార్డులను అందజేయనున్నారు.


గండేపల్లి మండలం నీలాద్రిపేట ప్రాథమిక పాఠశాలలో సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ఎస్.వి. సూర్యకుమారి, పి.నాయకంపల్లి ప్రాథమిక పాఠశాలలో సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న బి.ఎస్.ఎస్.ఆర్. గోపాల్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల ప్రతిభను వెలికితీయడంలో వారు అందించిన సేవలను ప్రభుత్వం గుర్తించి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు.

ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు కె.హెచ్. నాయక్, కె. వెంకటరెడ్డి అవార్డులకు ఎంపికైన ఉపాధ్యాయులను అభినందించారు. వారి సేవలు ఇతర ఉపాధ్యాయులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు

# ధర్మ రక్షణకే శ్రీకృష్ణావతారం.

-బీసీవై పార్టీ ఇంచార్జ్ గొంప శివకుమార్ యాదవ్



**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, సెప్టెంబర్, 04:** శ్రీ కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్తిపాడు నియోజకవర్గంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారత చైతన్య యువజన పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గం ఇంచార్జ్ గొంప శివకుమార్ యాదవ్ వివిధ మండలాల్లో పర్యటించి కృష్ణాష్టమి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

?ప్రత్తిపాడు, ఏలేశ్వరం, రౌతులపూడి మండలాల పరిధిలోని రౌతుపాలెం, లింగంపర్తి, ఏలేశ్వరం, రౌతులపూడి, బంగారిపేట, గ్రామాల్లో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, మంగళ హారతులు అర్పించారు.

?అనంతరం గొంప శివకుమార్ మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా కృష్ణాష్టమి పండుగ నిలుస్తుందని పేర్కొన్నారు. సమాజంలో అధర్మాన్ని అణచివేసి ధర్మాన్ని పరిరక్షించేందుకు శ్రీకృష్ణ పరమాత్ముడు అవతరించారని గుర్తుచేశారు. ఆ వాసుదేవుని దివ్య ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలతో తులతూగాలని ఆయన ఆకాంక్షించారు.

?ఈ కార్యక్రమంలో బీసీవై పార్టీ స్థానిక నాయకులు, దేవర శ్రీను, కార్యకర్తలు, గ్రామ ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ດ

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

పుట్టినరోజు, పెళ్లిరోజు సందర్భంగా కనీసం ఒక మొక్క నాటే సంప్రదాయాన్ని అలవర్చుకోవాలి: డా. ఎం. శ్రీనివాసరెడ్డి




**గండేపల్లి, పెన్ పవర్ ,సెప్టెంబర్ 4:** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాల కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు.

గండేపల్లి మండలం సురంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ సెక్యూరిటీ సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డా. ఎం. శ్రీనివాసరెడ్డి యూనివర్సిటీ ఆవరణతో పాటు ఏడీబీ రోడ్డులోని డివైడర్ మధ్యలో మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పేరుతో అడవులను విచక్షణారహితంగా నరికివేయడం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందన్నారు. ఫలితంగా వాతావరణంలో అనేక మార్పులు చోటుచేసుకుని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు.

ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజు, పెళ్లిరోజు వంటి ప్రత్యేక సందర్భాల్లో కనీసం ఒక మొక్కనైనా నాటి, దానిని సంరక్షించే సత్ సంప్రదాయాన్ని అలవర్చుకోవాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో సెక్యూరిటీ ఇన్‌చార్జ్ చక్రవర్తి, సూపర్‌వైజర్ డి. శివప్రసాద్, భాషా, మణిబాబు తదితరులు పాల్గొన్నారు.

# అభిషేక్ శర్మ కాదు.. వైభవ్ సూర్యవంశీకి సరైన ఓపెనింగ్ జోడి అతడే!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ తరఫున బరిలోకి దిగి భారత జాతీయ జట్టులోకి దూసుకొచ్చిన 15 ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీ ప్రస్తుతం అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాడు. జూన్‌లో ఇంగ్లాండ్‌పై అంతర్జాతీయ అరంగేట్రం చేసినప్పటికీ, ఆ తర్వాత జరిగిన జింబాబ్వే పర్యటనలో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డుతో తన ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పాడు. ఇప్పటివరకు తాను ఆడిన 6 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లోనూ అభిషేక్ శర్మతో కలిసే ఓపెనింగ్ చేశాడు. కానీ, సెప్టెంబర్ 13వ తేదీన ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో ఆఫ్ఘనిస్థాన్‌తో జరగబోయే మ్యాచ్ ద్వారా వైభవ్ భారత్‌లో తన మొదటి మ్యాచ్ ఆడబోతున్న వేళ, ఓపెనింగ్ జోడీలో మార్పులు చేయాలని మాజీ వికెట్ కీపర్ దీప్ దాస్‌గుప్తా టీమిండియా మేనేజ్‌మెంట్‌కు కీలక సూచన చేశాడు.

**సంజూ శాంసన్ - వైభవ్ కాంబినేషన్ అదుర్స్:**

భారత టీ20 జట్టులో ప్రస్తుతం అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, సంజు శాంసన్‌లతో పాటు ఇషాన్ కిషన్ రూపంలో నలుగురు ఓపెనింగ్ ఆప్షన్లు అందుబాటులో ఉన్నాయి. తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడిన దాస్‌గుప్తా, ఇప్పటివరకు అభిషేక్ - వైభవ్, అభిషేక్ - సంజు కాంబినేషన్లను మాత్రమే చూశాం, ఇంకా సంజు - వైభవ్ జోడీని పరీక్షించలేదని పేర్కొన్నాడు. ఆఫ్ఘనిస్థాన్‌తో సిరీస్‌లో సంజు శాంసన్‌ను వైభవ్‌తో కలిసి ఇన్నింగ్స్ ప్రారంభించేలా చేస్తే ఈ కాంబినేషన్ ఎంతవరకు వర్కవుట్ అవుతుందో క్లారిటీ వస్తుందని అభిప్రాయపడ్డాడు.

**అభిషేక్‌ను పక్కన పెట్టడం కాదు:**

ఈ సరికొత్త కాంబినేషన్ సూచనపై వివరణ ఇస్తూ, అభిషేక్ శర్మను జట్టు నుంచి తొలగించాలని తాను అనడం లేదని దాస్‌గుప్తా స్పష్టం చేశాడు.ద

రాబోయే టీ20 ప్రపంచకప్‌కు ముందు అందుబాటులో ఉన్న ప్రతి ఆటగాడికి, అన్ని కాంబినేషన్లకు తగినంత అవకాశం ఇవ్వడమే ప్రధాన లక్ష్యం.. మెగా టోర్నీకి ముందు జట్టుకు ఏ జోడీ బాగా సెట్ అవుతుందో అర్థం చేసుకోవడానికి, ఆటగాళ్లకు తగినంత మ్యాచ్ టైమ్ ఇవ్వడానికి ఇలాంటి ప్రయోగాలు ఎంతగానో ఉపయోగపడతాయని వెల్లడించాడు.

**రైట్ - లెఫ్ట్ కాంబినేషన్ అడ్వాంటేజ్:**

మరోవైపు అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్ ముగ్గురూ లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్లు కావడం గమనార్హం. కుడిచేతి వాటం బ్యాటర్ అయిన సంజు శాంసన్‌ను ఓపెనర్‌గా పంపడంతో జట్టుకు రైట్ - లెఫ్ట్ ఓపెనింగ్ కాంబినేషన్ అడ్వాంటేజ్ కూడా దక్కుతుందని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ మేనేజ్‌మెంట్ జింబాబ్వే సిరీస్ హీరో వైభవ్ పక్కన సంజు శాంసన్‌ను దించుతుందా లేక పాత ఓపెనింగ్ జోడీకే ప్రాధాన్యత ఇస్తుందా అనేది ఇప్పుడు తీవ్ర ఆసక్తికరంగా మారింది.

# నేడు భారత్--పాక్ మహిళల క్రికెట్ సమరం.. ఎప్పుడు, ఎక్కడ చూడాలంటే?



**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళల ఆసియా కప్ 2026లో భారత్--పాకిస్థాన్ జట్ల మధ్య ఆసక్తికర పోరుకు రంగం సిద్ధమైంది. సెప్టెంబర్ 5న దుబాయ్ వేదికగా ఈ హైవోల్టేజ్ మ్యాచ్ జరగనుంది. ఇప్పటికే సెమీఫైనల్ బెర్త్ ఖరారు చేసుకున్న భారత జట్టు.. గ్రూప్ దశను మరో విజయంతో ముగించాలని పట్టుదలగా ఉంది.

**హాంకాంగ్‌పై భారీ విజయం**

భారత్ తన గత మ్యాచ్‌లో హాంకాంగ్‌ను 137 పరుగుల తేడాతో చిత్తు చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా 20 ఓవర్లలో 193 పరుగులు చేసింది. స్మృతి మంధాన 124 పరుగులతో అద్భుత ఇన్నింగ్స్ ఆడగా.. అనంతరం భారత బౌలర్లు హాంకాంగ్ బ్యాటింగ్‌ను కేవలం 56 పరుగులకే కట్టడి చేశారు. దీప్తి శర్మ మూడు వికెట్లు తీసుకోగా, శ్రీ చరణి, నందిని శర్మ, ప్రీతికా రావల్ రెండేసి వికెట్లతో రాణించారు.

**భారత్-పాక్ మ్యాచ్ వివరాలు**

తేదీ: సెప్టెంబర్ 5, శనివారం
వేదిక: దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం
మ్యాచ్ ప్రారంభం: రాత్రి 8:00 గంటలకు (భారత కాలమానం)
టాస్: రాత్రి 7:30 గంటలకు
టీవీలో: సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్
ఆన్‌లైన్‌లో: సోనీ లివ్

మహిళల ఆసియా కప్ మ్యాచ్‌లు భారత కాలమానం ప్రకారం రాత్రి 8 గంటలకు ప్రారంభమవుతున్నాయి. భారత్--పాకిస్థాన్ పోరును కూడా సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్, సోనీ లివ్‌లో ప్రత్యక్షంగా వీక్షించవచ్చు.

**సెమీఫైనల్‌కు ముందు కీలక మ్యాచ్**

భారత్ ఇప్పటికే నాకౌట్ దశకు చేరుకోవడంతో ఈ మ్యాచ్ ఫలితం కంటే సెమీఫైనల్‌కు ముందు జట్టు కూర్పు, ఆటగాళ్ల ఫామ్‌పై దృష్టి పెట్టే అవకాశం ఉంది. స్మృతి మంధాన, షెఫాలీ వర్మ వంటి బ్యాటర్లు మంచి టచ్‌లో ఉండటం టీమిండియాకు సానుకూల అంశంగా మారింది. మరోవైపు పాకిస్థాన్ కూడా భారత్‌కు గట్టి పోటీ ఇవ్వాలని భావిస్తోంది. దీంతో శనివారం రాత్రి జరిగే దాయాదుల పోరుపై క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

# దులీప్ ట్రోఫీ ఫైనల్‌కు సిరాజ్, పడిక్కల్.. సౌత్ జోన్ జట్టులో చోటు!



**హైదరాబాద్ పెన్ పవర్:** దులీప్ ట్రోఫీ ఫైనల్ పోరుకు భారత స్టార్ క్రికెటర్లు మహ్మద్ సిరాజ్, దేవదత్ పడిక్కల్ సిద్ధమయ్యారు. సెప్టెంబర్ 6 నుంచి ఈస్ట్ జోన్‌తో జరగనున్న ఫైనల్ కోసం సౌత్ జోన్ జట్టులో వీరిద్దరికీ చోటు దక్కింది. ఇటీవల శ్రీలంకతో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌లోనూ ఇద్దరూ భారత్ తరఫున ఆడారు. ఈ సిరీస్‌ను భారత్ 1-0తో గెలుచుకుంది.శ్రీలంక సిరీస్‌లో పడిక్కల్ అద్భుతంగా రాణించాడు. మూడు ఇన్నింగ్స్‌ల్లో 328 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచాడు. ఇందులో రెండు సెంచరీలు ఉన్నాయి. మరోవైపు సిరాజ్ రెండు టెస్టుల్లో నాలుగు వికెట్లు పడగొట్టాడు. అయితే దులీప్ ట్రోఫీ ఫైనల్ కోసం వీరిద్దరూ సౌత్ జోన్ జట్టులో ఎవరిని భర్తీ చేస్తారన్నది ఇంకా స్పష్టంగా తెలియలేదు.టీ20 జట్టులో రెగ్యులర్‌గా ఉంటున్న వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ కూడా ఫైనల్‌లో ఆడే అవకాశం ఉందని సమాచారం. సెప్టెంబర్ 10న దులీప్ ట్రోఫీ ఫైనల్ ముగియనుండగా.. సెప్టెంబర్ 13 నుంచి ఆఫ్ఘనిస్థాన్‌తో టీ20 సిరీస్ ప్రారంభం కానుంది. అయినా ఫైనల్‌లో ఆడేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు తిలక్ ఇప్పటికే చెప్పాడు. నార్త్ జోన్‌తో సెమీఫైనల్లో తిలక్ తొలి ఇన్నింగ్స్‌లో 116 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 51 పరుగులతో ఆకట్టుకున్నాడు. సౌత్ జోన్ సెమీఫైనల్లో నార్త్‌ను 181 పరుగుల ఛేదనలో ఓడించింది. మరోవైపు ఈస్ట్ జోన్ 159 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి డిఫెండింగ్ ఛాంపియన్ సెంట్రల్ జోన్‌ను ఫైనల్ రేసు నుంచి తప్పించింది. ఇషాన్, సూర్యవంశీ ఆడకపోతే ఈస్ట్ జోన్ కొత్త కెప్టెన్‌ను ఎంపిక చేయాల్సి ఉంటుంది. బెంగాల్‌కు చాలాకాలంగా కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న అభిమన్యు ఈశ్వరన్‌కు ఆ బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది.

# యశ్ ఈసారి వెళ్లేది ఏ పరిశ్రమకి!

-కేజీఎఫ్- ఫ్రాంచైజ్‌తో కన్నడ చిత్ర పరిశ్రమ సరిహద్దులు దాటి పాన్-ఇండియా స్థాయిలో తిరుగులేని క్రేజ్‌ను సంపాదించుకున్నారు రాకింగ్ స్టార్ యశ్. ఒక్క సినిమాతో గ్లోబల్ గుర్తింపు తెచ్చుకున్న యశ్ ప్రతీ ప్రాజెక్ట్‌ను వ్యూహాత్మకంగా ఎంచుకుంటున్నారు. కన్నడ ఇండస్ట్రీకి చెందిన ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో చేసిన -కేజీఎఫ్- ప్రభంజనం అనంతరం .. మలయాళ పరిశ్రమకు చెందిన ప్రతిభావంతమైన దర్శకురాలు గీతూ మోహన్‌దాస్‌తో కలిసి -టాక్సిక్- చిత్రాన్ని పట్టాలెక్కించిన సంగతి తెలిసిందే. ఇటీవలే భారీ అంచనాల మధ్య విడుదలైందీ చిత్రం. ఇలా విభిన్న పరిశ్రమల ట్యాలెంట్ తో ముందుకు సాగుతున్న యశ్ తదుపరి చిత్రం కోసం ఏ పరిశ్రమ వైపు అడుగులు వేస్తారనేది ఆసక్తికరం.



యశ్ ప్రయాణాన్ని పరిశీలిస్తే ఆయన కేవలం ఒకే పరిశ్రమకు ఫార్ములాకు కట్టుబడి ఉండటం లేదని స్పష్టమవుతోంది. కన్నడ డైరెక్టర్‌తో ఇండియన్ బాక్సాఫీస్‌ను షేక్ చేసిన యశ్ ఆ తర్వాత కేరళకు చెందిన ఆఫ్-బీట్ .. కంటెంట్-డ్రివెన్ ఫిల్మ్ మేకర్ గీతూ మోహన్‌దాస్‌ను ఎంచుకుని ఆశ్చర్యపరిచారు. ఈ ప్రయోగం ఆయన మేకింగ్‌లో .. కథల ఎంపికలో సరికొత్త కోణాన్ని ఆవిష్కరించింది. విభిన్న చిత్ర పరిశ్రమలలోని ప్రతిభను ఉపయోగిస్తూ గ్లోబల్ ఆడియన్స్‌ను ఆకట్టుకోవడమే లక్ష్యంగా యశ్ ప్రణాళికలు సాగుతున్నాయి.

ఈ నేపథ్యంలోనే యశ్ తదుపరి చిత్రం ఏ ఇండస్ట్రీకి చెందిన దర్శకుడితో ఉండబోతోందనే దానిపై చర్చ నడుస్తోంది. ప్రస్తుతం





కోలీవుడ్ ..టాలీవుడ్ పరిశ్రమలకు చెందిన పలువురు అగ్ర దర్శకులు ఆయనతో సినిమాలు చేసేందుకు క్యూలో ఉన్నారని తెలిసింది. తమిళ పరిశ్రమలోని భారీ యాక్షన్ యూనివర్స్ సృష్టించే విజనరీ దర్శకులు, టాలీవుడ్‌లోని లార్జర్ ద్యాన్ లైఫ్ కాన్సెప్ట్‌లను తెరకెక్కించే స్టార్ డైరెక్టర్లు యశ్ కోసం పవర్‌ఫుల్ స్క్రిప్ట్‌లను సిద్ధం చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.

ముఖ్యంగా టాలీవుడ్ మాస్ .. హై-వోల్టేజ్ డ్రామాలకు పెట్టింది పేరు . కోలీవుడ్ గ్రిప్పింగ్ స్క్రీన్‌ప్లే .. స్టైలిష్ ప్రెజెంటేషన్‌కు ప్రాధాన్యత ఇస్తుంది. యశ్ కున్న మాస్ ఇమేజ్‌కు టాలీవుడ్ దర్శకుడి విజన్ తోడైతే బాక్సాఫీస్ వద్ద మరో సంచలనం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు. కోలీవుడ్ లో ఉన్న టాలెంటెడ్ మేకర్స్‌తో జతకడితే యశ్ మార్కెట్ మరింత విస్తరించే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ రెండింటిలో యశ్ ఎవరికి ఓటు వేస్తారనేది ఆసక్తికరం. చివరిగతా ఉత్తరాది, దక్షిణాది సరిహద్దులను చెరిపేస్తూ ప్రతీ భాషలోని అత్యుత్తమ సాంకేతిక నిపుణులను, దర్శకులను ఒకే వేదికపైకి తెచ్చేలా యశ్ వ్యూహం కనిపిస్తోంది. అందుకే యశ్ తదుపరి ఎంపిక కూడా ప్రతిష్టాత్మకంగా ఊహించని కాంబినేషన్‌లో ఉండే అవకాశం ఉందనే ప్రచారం బలపడుతోంది. దీనిపై పూర్తి క్లారిటీ రావాలంటే మరింత సమయం పడుతుంది. ప్రస్తుతం యశ్ బాలీవుడ్ లో తెరకెక్కుతోన్న -రామాయణం-లో రావణుడి పాత్ర పోషిస్తోన్న సంగతి తెలిసిందే. రెండు భాగాలుగా తెరకెక్కుతోన్న చిత్రం మొదటి భాగం దీపావళి కానుకగా రిలీజ్ అవుతుంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com